

ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం

- ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతులు విలీనం
- 1,2 తరగతులతోనే ప్రైమరీ స్కూళ్లు
- నివేదిక పంపాలని కోరిన పాఠశాల విద్యాశాఖ
- కోడ్ ఉన్నా పట్టించుకోని అధికారులు



- 6వ పేజీలో

ఘనంగా టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం



తెలుగుదేశం 43వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థి ఎం.శ్రీభరత్, పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎమ్మెల్సీలు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

- వార్త 10లో

భక్తి, శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



గుడ్ ఫ్రైడేను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నగర పరిధిలోని పలు చర్చిల్లో ఉదయం నుంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు మానవాళి కోసం ఏసు చేసిన త్యాగాలను వివరించారు. ఏసు మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఈ సందర్భంగా సూచించారు.

వైసీపీ నేతలకు రామవరం లేఅవుట్!?

మధ్య తరగతి కోసం స్మార్ట్ టౌన్‌షిప్స్ పేరుతో వీఎంఆర్‌డీఏ హడావుడి

- దరఖాస్తుల స్వీకరణ
- బాగా డిమాండ్ ఉన్న ఆనందపురం మండలం రామవరం లేఅవుట్‌లో ప్లాట్లను ఎవరికీ విక్రయించవద్దని అధికార పార్టీ పెద్దల పైనుంచి ఆదేశాలు
- మళ్లీ గెలిస్తే బాగా సొమ్ము చేసుకోవచ్చుననే యోచన
- అమ్మకాలు నిలిపివేసిన అధికారులు



ఆనందపురం మండలం రామవరంలో లేఅవుట్ ఏర్పాటుకు ప్రతిపాదించిన ప్రాంతం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)ను అధికార పార్టీ తన ఇష్టానుసారం ఉపయోగించుకుంటుంది. చెప్పిన పనులు చేసిపెట్టేందుకు అనుకూలమైన ఐఏఎస్ అధికారిని అక్కడ సీట్లో కూర్చోబెట్టింది. అప్పటి నుంచి అక్కడ వైసీపీ ఏమి అనుకుంటే అదే జరుగుతోంది. తాజాగా వంద ఎకరాల లేఅవుట్‌ను చేజిక్కించుకునేందుకు వైసీపీ పెద్దలు వ్యూహం రూపొందిస్తే...దానిని ఇక్కడి అధికారి తు.చ. తప్పకుండా అమలు చేసి పెట్టారు. ఇదంతా మధ్య తరగతి ప్రజల సొంత ఇంటి కల సాకారం పేరుతో చేయడం గమనార్హం.

ఎంఐజీ స్మార్ట్ టౌన్‌షిప్స్ పేరుతో వైసీపీ ప్రభుత్వం 2021 మార్చి నెలలో ఒక పథకం ప్రకటించింది. ఏడాదికి రూ.3 లక్షల నుంచి రూ.18 లక్షల ఆదాయం ఉన్న వారికి మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకు ఇళ్ల స్థలాలు ఇస్తామంటూ ఆహ్వానించింది. విశాఖపట్నంలో 1.4 లక్షల దరఖాస్తులు రావడంతో లేఅవుట్లు వేస్తామంటూ ల్యాండ్ పూలింగ్‌కు శ్రీకారం చుట్టారు. గతంలో ల్యాండ్ పూలింగ్ విధానం వివాదాస్పదం కావడంతో ఈసారి ఆ బాధ్యతను రెవెన్యూకు అప్పగించారు. నగర శివారునున్న ఆనందపురం మండలంలోని జీఎస్ అగ్రహారం, రామవరం, పాలవలస గ్రామాల్లో 363 ఎకరాల అసైన్డ్, ప్రభుత్వ భూములు సమీకరించారు. వారికి అభివృద్ధి చేసిన లేఅవుట్లలో ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. 150, 200, 240 గజాలతో లేఅవుట్ వేశారు. ఇలా పాలవలస, రామవరం, గంగసాని అగ్రహారాల్లో నాలుగు లేఅవుట్లలో 2,310 ప్లాట్లను అమ్మకానికి పెట్టారు. పాలవలసలో గజం రూ.18 వేలు

... మిగతా 6వ పేజీలో




రామవరం లేఅవుట్ ప్లాన్

భీమిలిపై వీడిన ఉత్కంఠ

టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావే

ఎట్టకేలకు ప్రకటించిన అధిష్ఠానం

పార్టీ శ్రేణుల్లో హర్షం



గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సీనియర్ నాయకులు గంటా శ్రీనివాసరావు ఈసారి భీమిలి నుంచి పోటీ చేయనున్నారు. ఆయన అభ్యర్థిత్వాన్ని టీడీపీ అధిష్ఠానం శుక్రవారం ఖరారుచేసింది. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గంటా శ్రీనివాసరావు రానున్న ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేయాలని భావించారు. ఆ మేరకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడును కలిసి, అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే ఈసారి విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి బొత్స సత్యనారాయణపై పోటీ చేయాలని చంద్రబాబునాయుడు సూచించారు. అక్కడ విజయం సాధిస్తే మంచి పేరు వస్తుందని వెళ్లాలని ఆదేశించారు. అయితే చీపురుపల్లి తనకు దూరం అవుతుందని, వెళ్లి రావడం ఇబ్బందిగా ఉంటుందని గంటా తన మనసులో మాట వెల్లడించారు.

అనేక తర్జనభర్జనల అనంతరం

గంటాను చీపురుపల్లి వెళ్లాల్సిందిగా సూచించిన అధిష్ఠానం భీమిలి నియోజకవర్గానికి పలువురి పేర్లను పరిశీలనలోకి తీసుకుంది. పార్టీ ఇన్‌చార్జి కోరాడ రాజాబాబు, నెల్లిమర్ల పార్టీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పేర్లను తొలుత పరిశీలించింది. ఆ తరువాత బైరా ఫౌండేషన్ చైర్మన్ దిలీప్ చక్రవర్తి పేరును కూడా జాబితాలో చేర్చింది. ఈ ముగ్గురిలో ఒకరికి భీమిలి టిక్కెట్ ఇవ్వాలని భావించింది. అయితే గంటా శ్రీనివాసరావు చివరి వరకు చేసిన ప్రయత్నాలు, భీమిలిలో సీనియర్ నాయకులే బరిలో ఉండాలని పార్టీ అధినేత భావించడంతో గంటా పేరునే ఖరారు చేశారు. తనకు టికెట్ కేటాయించినందుకు చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గంటా పేరును ప్రకటించగానే భీమిలిలో పార్టీ శ్రేణులు బాణాసంచా కాల్చి హర్షాతిరేకాలు వ్యక్తంచేశాయి. కూటమిలోని జనసేన, బీజేపీ నాయకులు ఆయన్ను కలిసి అభినందనలు తెలియజేశారు.

ఒకసారి ఎంపీగా, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపు

గంటా శ్రీనివాసరావు 1999లో రాజకీయ అరంగేట్రం చేశారు. తెలుగుదేశం పార్టీ తరపున అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయన ఐదు ఎన్నికల్లో పోటీ చేశారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారి ఎంపీగా గెలిచిన తరువాత 2004 ఎన్నికల్లో చోడవరం నుంచి అసెంబ్లీకి పోటీ చేసి విజయం సాధించారు. 2009

... మిగతా 6వ పేజీలో

అధర్మచంద్రారెడ్డి

- విశాఖ జిల్లాలో తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో అనేక అభియోగాలు... ఏసీబీ కేసు కూడా నమోదు
- వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూములు
- ప్రభుత్వం చేజారడానికి ఆయనే కారణమని ఆరోపణలు
- సకాలంలో అప్పీల్‌కు వెళ్లకపోవడంతో
- భీమిలి ప్రాంతంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): కడప మాజీ రెవెన్యూ డివిజనల్ అధికారి ధర్మాచంద్రారెడ్డి విశాఖపట్నం జిల్లాలో తహసీల్దారుగా పనిచేసిన సమయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. తహసీల్దారు హోదాలో ఆయన కీలకమైన పద్మనాభం, భీమిలి, విశాఖ అర్బన్ మండలాల్లో పనిచేశారు. పనిచేసిన ప్రతిచోట ఒకటి, రెండు అభియోగాలు మోపబడ్డాయి. సుమారు 22 ఏళ్ల క్రితం పద్మనాభం మండలంలో తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో ఏసీబీ దాడులు జరిగాయి. మండలంలోని ఏనుగులపాలెం గ్రామంలో ఒక రైతు తన పొలంలో టేకు చెట్లు నరికివేతకు నిరభ్యంతర పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా

... మిగతా 6వ పేజీలో

లంకెలపాలెం కూడలిలో బ్రేకులు ఫెయిల్

బొగ్గు లారీ బీభత్సం

- సిగ్నల్ లైట్స్ వద్ద ఆగి ఉన్న వాహనాలపైకి దూసుకుపోయిన వాహనం
- రెండు కార్లు, ఆటో, ట్రాక్టర్, ద్విచక్ర వాహనాలు ధ్వంసం
- ఎనిమిది మందికి తీవ్రగాయాలు
- ముగ్గురి పరిస్థితి ఆందోళనకరం



ప్రమాదానికి కారణమైన బొగ్గు లారీ

లంకెలపాలెం, మార్చి 29: జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలి వద్ద శుక్రవారం మధ్యాహ్నం బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బీభత్సం సృష్టించింది. బ్రేకులు ఫెయిలవ్వడంతో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆగి ఉన్న వాహనాలపైకి దూసుకుపోయింది. దీంతో రెండు కార్లు, ఆటో, ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలిలో మధ్యాహ్నం 12.50 గంటల సమయంలో గాజువాక వైపు నుంచి వచ్చే వాహనాలకు రెడ్ సిగ్నల్ పడింది. ఈ క్రమంలో అనకాపల్లి వైపు వెళుతున్న రెండు కార్లు, ఒక ఆటో, ఒక ట్రాక్టర్, రెండు ద్విచక్ర వాహనాలు ఆగి ఉన్నాయి. ఇదే సమయంలో గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో వేగంగా వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. దీంతో సిగ్నల్ వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను, ఎడమ వైపు వున్న కారును బలంగా ఢీకొన్నది. ఆ వాహనాలు... ముందున్న మిగిలిన వాహనాలను ఢీకొన్నాయి. కారుపైకి ట్రాక్టర్ దూసుకుపోయింది. లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది. డివైడర్ రెయిలింగ్ ధ్వంసం కావడంతోపాటు సెంట్రల్ లైటింగ్ స్తంభం కూలిపోయింది. ఈ

... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శని)	6.13
సహరి (ఆది)	4.37

పాలిటెక్నిక్ విద్యార్థిని బలవన్మరణం

- లైంగిక వేధింపులే కారణమంటూ తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా మెసేజ్
- గురువే కీచకుడిగా మారిన వైనం

కొమ్మాది చైతన్య పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని ఆ విద్యా సంస్థ హాస్టల్ భవనం పైనుంచి దూకి శుక్రవారం ఆత్మహత్య చేసుకుంది.

- వార్త మెయిన్ 3లో

ఐపీఎల్ సందడి




ఎయిర్‌పోర్టు వద్ద రిషబ్ పంత్

- నగరానికి చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు
- ఇరు జట్ల మధ్య ఐపీఎల్ మ్యాచ్ రేపు
- నేడు నెట్ ప్రాక్టీస్

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 29: నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈనెల 31న జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లో పాల్గొనే చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల ఆటగాళ్లు శుక్రవారం సాయంత్రం నగరానికి చేరుకున్నారు. శుక్రవారం నగరానికి చేరుకున్న చెన్నై సూపర్‌కింగ్స్ ఆటగాళ్లలో ఎంఎస్ ధోనీతోపాటు రుతురాజ్ గైక్వాడ్, రహానే, షేక్ రషీద్, సమీర్ రిజ్వీ, రవీంద్ర జడేజా, మిశ్చల్, శివం దుబే, అవినాష్ రావు, రాజవర్ధన్, దీపక్ చాహర్, ప్రశాంత్ సోలంకి,

... మిగతా 6వ పేజీలో



నొవాటెల్ హోటల్ వద్ద ఎంఎస్ ధోనీ

అప్పన్నకు సీఎం రమేశ్ పూజలు



సింహాచలంలో అప్పన్న తొలి పావంచా వద్ద పూజలు నిర్వహిస్తున్న సీఎం రమేశ్ - వార్త 6లో

భీమిలి అభ్యర్థిగా గంటా ఎంపికపై హర్షం



గంటాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాలమరశెట్టి శ్రీను

మద్రిపాలెం, మార్చి 29: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావును పేరు అధిష్టానం ప్రకటించడంతో ఆపార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈసందర్భంగా గంటాను పార్టీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

7 తులాల బంగారం అపహరణ

వేపగుంట మార్చి 29: జీవీఎంసీ 98వ వార్డు శివారు ప్రాంతాల్లో వరుస చోరీలతో జనాలు బెం బేలెత్తిపోతున్నారు. అప్పన్నపాలెంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగి దాదాపు 7 తులాల బంగారం, 150 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. వివరావి.. ఈ ఇంట్లో ఉన్న మిలటరీలో పనిచేసి పదవీ విరమణ చేసిన వీవీఎన్ ఆచార్యులు, కామాక్షి దంపతులు కాశీ, అయోధ్య తీర్థయాత్రలకు పదిరోజుల కిందట వెళ్లారు. ఈ క్రమంలో చోరీ జరిగింది.

ఆస్తి పన్ను చెల్లింపునకు బారులు

జ్ఞానాపురం, మార్చి 29: ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్నును వడ్డీ లేకుండా చెల్లింపునకు మార్చి 31 ఆఖరు తేదీ కావడంతో పన్ను చెల్లింపుదారులు జ్ఞానాపురంలోని సౌకర్యం కేంద్రం ఎదుట క్యూ కట్టారు. వారికి ఇబ్బందులు కలుగకుండా మరో ప్రత్యేక కౌంటర్, తాగునీటి సదుపాయం ఏర్పాటుచేసినట్టు జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ ఈసందర్భంగా తెలిపారు. ప్రభుత్వం 31వ తేదీలోగా చెల్లించేవారందరికీ వడ్డీ మాఫీ చేస్తోందన్నారు. ఆదివారం కూడా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజకీయాల్లో డబ్బు ప్రమేయం తగ్గాలి

జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



ప్రచారంలో జేడీ లక్ష్మీనారాయణ, కొణతాల

సీతంపేట, మార్చి 29: రాజకీయాల్లోకి మంచి వ్యక్తులు రావాలని, డబ్బు ప్రమేయం తగ్గాలని జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఉత్తర నియోజక వర్గంనుంచి పోటీ చేస్తున్న ఆయన ఎన్నికల ప్రచారాన్ని సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయం నుంచి ప్రారంభించారు. తొలుత ఆయనకు స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికి తిలకం దిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత ఎన్నికల్లో విశాఖ ఎంపీ స్థానానికి పోటీ చేశానన్నారు. ఈసారి తనకు ఉత్తర నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉందని అన్నారు. విశాఖ దక్షిణం నుంచి తమ పార్టీ తరఫున అభ్యర్థిని నిలుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

సీతంపేట, మార్చి 29: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. మహారాణిపేట, అక్కయ్యపాలెం, దొండపర్తి ప్రాంతాల్లో అనుమానిత వాహనాలను స్టేషన్‌కి తరలించారు.

వైసీపీ నేతలకు రామవరం లేఅవుట్!?

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. రామవరం, గంగసాని అగ్రహారం లేఅవుట్లలో గజం రూ.14 వేలు ధర పెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంఐజీలో 20 శాతం రాయితీ ఇస్తామన్నారు. ప్లాట్ల సంఖ్యలో 10 శాతం రిజర్వేషన్ కూడా ప్రకటించారు.

రామవరం ఆకట్టుకోవడంతో నిలిచిన అమ్మకాలు

రామవరంలో వేసిన లేఅవుట్ జాతీయ రహదారికి సమీపాన రాకపోకలకు అనుకూలంగా ఉండడం, పరిసరాలు కూడా త్వరగా అభివృద్ధి చెందే అవకాశం ఉండడంతో వైసీపీ పెద్దల కన్ను పడింది. ఈ లేఅవుట్‌లో ప్లాట్లను అమ్మవద్దని, భవిష్యత్తు అవసరాల పేరుతో పక్కన పెట్టాలని ఆదేశించారు. చెప్పిందే తడవుగా ఆ లేఅవుట్‌లో అమ్మకాలు నిలిపివేశారు. అన్ని లేఅవుట్లను ఒకేసారి అభివృద్ధి చేయడం కష్టమని, ఒక్కొక్కటి చేసుకుంటూ వస్తామని కొత్త పల్లవి అందుకొని ముందుగా పాలవలసలో ప్లాట్లు కేటాయిస్తామంటూ అక్కడి నుంచి అమ్మకాలు ప్రారంభించారు. రామవరానికి పెద్దగా డిమాండ్ లేదని, తక్కువ దరఖాస్తులు వచ్చాయని చెప్పి ఆ లేఅవుట్‌ను వైసీపీ పెద్దల కోసం పక్కన పెట్టేశారు.

రామవరం లేఅవుట్ కోసం 75 మంది రైతుల నుంచి సర్వే నంబర్లు 141 నుంచి 154 వరకు మొత్తం 119.22 ఎకరాలు సేకరించారు. 240 గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్లు 222, 200 గజాల విస్తీర్ణం కలిగినవి 160, 150 గజాల విస్తీర్ణంతో 381 ప్లాట్లు వేశారు. ఇవి కాకుండా అంతకంటే చిన్న పరిణామం కలిగిన ప్లాట్లు మరో 106 వేశారు. మొత్తం 869 ప్లాట్లతో రూపొందించిన లేఅవుట్‌లో అమ్మకాలు ఆపేసి వైసీపీ పెద్దల కోసం రిజర్వు చేసేశారు. మొత్తం నాలుగు లేఅవుట్లలో 2,310 ప్లాట్లు కాగా అందులో అత్యధికం 869 రామవరంలోనే ఉండడం గమనార్హం.

నత్తనడకన పనులు

లేఅవుట్లను అన్నిరకాల మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని ప్రకటించిన వీఎంఆర్‌డీఏ అధికారులు ఆ పనులు ఏవీ చేయడం లేదు. అలా చేస్తే వాటికి డిమాండ్ పెరిగి కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తారని కావాలనే జాప్యం చేస్తున్నారు. ఇప్పటికే ముందుకువచ్చిన వారి నుంచి డబ్బులు వసూలుచేసి వాటితోనే నామమాత్రపు పనులు చేస్తున్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే...విశాఖను రాజధానిగా చేసుకొని పరిపాలన చేస్తుందని, అప్పుడు భూముల విలువ మరింత పెరుగుతుందని, అప్పుడు ఈ రామవరం లేఅవుట్‌ను ఉపయోగించుకోవాలనే ఆలోచనతోనే ఆ పార్టీ పెద్దలు మొత్తం రిజర్వు చేసుకున్నారని వీఎంఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి. అందుకే అక్కడ అమ్మకాలు నిలిపివేశారని స్పష్టంచేశాయి.

బొగ్గు లారీ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

ప్రమాదంలో బొగ్గు లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్‌తోపాటు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్న చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన కె.సంతోషి, కె.వెంకటరమణ, పాత గాజువాకకు చెందిన బి.శరణ్య, అగనంపూడికి చెందిన పల్లా శ్రీను, జి.హర్ష, జి.కొండయ్య డి.శ్రీనివాసరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్, డి.శ్రీనివాసరాజు, కె.వెంకటరమణల పరిస్థితి ఆందోళనకరంగా వుందని పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పరవాడ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సాయంతో సుమారు గంటపాటు శ్రమించి తొలగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పరవాడ పోలీసులు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం

- ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతులు విలీనం
- 1,2 తరగతులతోనే ప్రైమరీ స్కూళ్లు
- నివేదిక పంపాలని కోరిన పాఠశాల విద్యాశాఖ
- కోడ్ ఉన్నా పట్టించుకోని అధికారులు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారేలా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతోంది. దీంతో ప్రాథమిక పాఠశాలలు కేవలం 1,2 తరగతులకే పరిమితం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేయడంతో అధికారులు జీవీఎంసీ పరిధిలో ఉన్నత పాఠశాలలకు ఒక కి.మీ. పరిధిలో గల ప్రాథమిక పాఠశాలల వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఇటువంటి ప్రక్రియ చేపట్టకూడదని తెలిసినా పట్టించుకోవడం లేదు.

విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యతిరేకించినా రెండేళ్ల క్రితం జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడింది. విద్యాశాఖ అధికారులు వివరాలు చెప్పకపోయినా గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది.

అయితే రెండేళ్ల క్రితం తరగతుల విలీనానికి సంబంధించి విద్యాశాఖ జీవో 117, 128, 60 జారీచేసినప్పుడు మునిసిపల్ పాఠశాలలు మునిసిపల్ పరిపాలన శాఖ పరిధిలో ఉండడంతో 3,4,5 తరగతుల విలీనం జరగలేదు. ఇటీవల మునిసిపల్ పాఠశాలలను విద్యాశాఖ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో టీచర్ల రేషనలైజేషన్, 3,4,5 తరగతుల విలీన ప్రక్రియ తెరపైకి తీసుకువచ్చి మునిసిపల్ పాఠశాలలకు వర్తించేలా ఆదేశాలు ఇచ్చారు. తాజా ఆదేశాల మేరకు జీవీఎంసీలోని ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు విస్తరించి ఉంది. మొత్తం 115 ప్రాథమిక పాఠశాలలు ఉండగా సుమారు పది వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో ఉన్నత పాఠశాలలకు ఒక కి.మీ. దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలు ఎన్ని?, అక్కడ 3,4,5 తరగతులు ఎంతమంది చదువుతున్నారు?, టీచర్లు ఎంతమంది?...అనే వివరాలు సేకరించి తక్షణమే పంపాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమాచారం మేరకు సీతమ్మధారలోని నెహ్రూ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు కి.మీ. దూరంలో నక్కవానిపాలెం, మద్దిలపాలెం ప్రాథమిక పాఠశాలలు, మాధవధార ఉన్నత పాఠశాలకు సమీపంలో మాధవధారలో రెండు స్కూళ్లు ఉన్నాయి. మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు మొత్తమ్మీద సుమారు ఆరు వేల వరకు విద్యార్థులు ఉంటారని టీచర్లు అంచనా వేస్తున్నారు. విలీనం తరువాత కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్ పేర్కొన్నారు. తరగతుల విలీన ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జీవో 17తో ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్

డాబాగార్డెన్స్, మార్చి 29: నూతన విద్యా విధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లగా జీతాలు తప్ప మిగిలిన ఏ బిల్లులుచెల్లించకపోవడంతో రూ.21వేల కోట్ల మేర ఉపాధ్యాయులకుబకాయిలు పేరుపోయాయమన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ రామిరెడ్డి . రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి, దేముడుబాబు, పైడిరాజు, రవి, పరదేశి, శేషగిరిరావు, వరలక్ష్మి, ప్రభాకర్, రాజుపాల్గొన్నారు..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: విద్యుత్ స్తంభాల మార్పు నేపథ్యంలో శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 6 వరకు గాంధీనగర్ ఏరియా, ఎం ఆర్‌వో ఆఫీస్ ఏరియా, పోస్టు ఆఫీస్ ప్రాంతం, దొర ఆసుపత్రి, బే ఫేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

సంజీవయ్య కాలనీలో..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంజీవయ్య కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

'కూటమి గెలుపునకు కృషి'



విష్ణుకుమార్‌రాజుకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

మురళీనగర్, మార్చి 29; జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా విశాఖ ఉత్తరం నుంచి పోటీచేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెన్మెత్స విష్ణుకుమార్‌రాజు విజయం కోసం రాజీలేకుండా శ్రమిస్తామని జనసేన ఉత్తర నియోజకవర్గ నాయకులు సంకు. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగృహానికి విచ్చేసిన విచ్చేసిన విష్ణుకుమార్ రాజుకి సాదర స్వాగతం పలికారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ వైసీపీ నార్త్ అభ్యర్థి కేకే రాజు అతివిశ్వాసాన్ని అణచివేసేలా ప్రజలు తీర్పునివ్వాలన్నారు. నాయకులందరిఅండదండలతో తాను నియోజకవర్గ అభివృద్ధికి మరింతగా శ్రమిస్తానని ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన డాక్టర్స్ సెల్ కన్వీనర్ బి.రఘు, టీడీపీ సీనియర్ నాయకులు సనపల.వరప్రసాద్ ఉన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ శ్రావణి, ఆయా పార్టీల నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 29 : బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీని ఎన్టీరామారావు ప్రారంభించారని ఆ పార్టీ నేతలు అన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రేటర్ 26, 27 వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా వార్డుల టీడీపీ, బీజేపీ, జనసేన అధ్యక్షులు, నాయకులు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ వ్యవస్థాపకులు తారక రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. 26వ వార్డు చిన్నూరులోని పార్టీ కార్యాలయంలో వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు బండి కన్న, సీతమ్మధార మండల బీజేపీ అధ్యక్షుడు నాగడమూడి నానాజీ తదితరులు పాల్గొన్నారు. 27వ వార్డులో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. లక్ష్మీ శివప్రసాద్ పాల్గొన్నారు.

గండిబాబ్జీకి అభినందనలు

డాబాగార్డెన్స్: టీడీపీ విశాఖ దక్షిణ నియోజక వర్గ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆపార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు నూతనంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా గండిబాబ్జీని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని ఈసందర్భంగా అన్నారు.

వాల్తేరు డివిజన్ మరో రికార్డు

- ఆర్థిక సంవత్సరంలో 75 మిలియన్ టన్నుల సరకు రవాణా
- గత ఏడాది 69.6 మిలియన్ టన్నుల మాత్రమే

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజన్ మరో రికార్డును నెలకొల్పింది. ఇప్పటివరకూ ఎన్నడూ లేనంత స్థాయిలో సరకు రవాణా చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి 26వ తేదీ నాటికే 75 మిలియన్ టన్నుల మార్కును దాటేసింది. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో 69.6 మిలియన్ టన్నుల మాత్రమే సరకును చేరవేసింది. ఈసారి ఐదు రోజుల వ్యవధి ఉండగానే 75.64 మిలియన్ టన్నులు రవాణా చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ, అభివృద్ధి పనుల పేరుతో కొన్ని లైన్లలో రైళ్లను నిలిపివేసినప్పటికీ ఈ రికార్డును సాధించడం ఆనందంగా ఉందని, ఇదంతా సిబ్బంది సమన్వయంతోనే సాధ్యమైందని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ వెల్లడించారు.

అత్యధికం ముడి ఇనుమే



మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

వాల్తేరు డివిజన్ నుంచి అత్యధికంగా ముడి ఇనుము (ఐరన్‌ఓర్) రవాణా అవుతుంది. కొత్తవలస-కిరండోల్ మార్గంలో దీనిని తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో 22.88 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్ రవాణా చేశారు. ఇది గత ఏడాది చేసిన 22.66 మిలియన్ టన్నుల కంటే 22.4 శాతం అధికం. స్టీల్‌ప్లాంటుకే 4.19 మిలియన్ టన్నులు రవాణా చేశారు. ఇతర సరకులు చూసుకుంటే కోల్, కోక్ కలిపి 25.2 మి.టన్నులు, బాక్సైట్ 5.52 మి.టన్నులు, అల్యూమినా 3.77 మి.టన్నులు, ఐరన్ అండ్ స్టీల్ 3.2 మి.టన్నులు, శ్లాగ్, కాస్టిక్ సోడా, జిప్సమ్, కంటెయినర్ కార్గో తదితరాలు కలిపి 12.3 మి.టన్నులు రవాణా చేశామన్నారు. ఫొటోలు రైల్వే అని ఉన్నాయి.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

ఎలమంచిలి, మార్చి 29: మండలంలోని పులపర్తి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఆగి ఉన్న లారీని, వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఈ ప్రమాదంలో విశాఖపట్నంకు చెందిన మైలపల్లి వెంకట శివకుమార్(45) మృతి చెందగా, విశాఖకు చెందిన బీవీఎస్. కృష్ణ, కె.ధీరకుమార్‌లకు తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. పులపర్తి జంక్షన్ సమీపంలో తుని నుంచి విశాఖ వైపు వస్తూ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ టీ తాగేందుకు రోడ్డు పక్కన నిలిపారు. ఇదే సమయంలో భీమవరం నుంచి విశాఖ వైపు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. వీరిలో కారు డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న శివకుమార్ ఆస్పత్రిలో మృతి చెందగా.. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు విశాఖలోని వైభవ్ జ్యూయలర్స్ ప్రధాన బ్రాంచిలో పనిచేస్తుంటారని, కార్యాలయ పని మీద భీమవరం వెళ్లి తిరిగి విశాఖ వస్తుండగా ప్రమాదానికి గురైనట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సింహాచలం తెలిపారు.



జ్ఞానాపురంలోని రక్షణగిరిపై ప్రార్థనలు..



గుడ్‌ఫ్రైడేలో పాల్గొన్న విశ్వాసులు

త్యాగధనుడు ఏసుక్రీస్తు

- జ్ఞానాపురం చర్చిలో భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- క్రీస్తు శిలువ మోస్తూ వేషధారణలో ఊరేగింపు

జ్ఞానాపురం, మార్చి 29: సర్వమానవాళి పాపవిమోచనకు ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజే గుడ్ ఫ్రైడే అని రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాష్ అన్నారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకు శుక్రవారం జ్ఞానాపురం రక్షణగిరిపై పునీతపేతురు ప్రధాన దేవాలయంలో విచారణకర్త ప్రకాష్ నేతృత్వంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది విశ్వాసులు తరలివచ్చి క్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ సర్వజన రక్షణ కోరుతూ కన్నీటితో విచారణకర్తలు, గురువులు, మటవాసులు, దీక్షాపరులు దేవమాత గుహ నుంచి రక్షణగిరి కొండపైకి పరిశుద్ధ శిలువ మార్గాన్ని నిర్వహించారు. క్రీస్తు త్యాగాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థించారు. అనంతరం పునీతపుతేరు దేవాలయం వద్ద ఫాదర్ మల్లవరపు ప్రకాష్ దివ్యబలిపూజ జరిపారు. సందేశాన్ని వినిపించారు.

సీతమ్మధారలో...

సీతమ్మధార, మార్చి 29: సీతమ్మధారలోని బాలయేసు చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ప్రార్థనలుచేస్తూ గీతాలు ఆలపించారు. భక్తులు మోకరిల్లి యేసుప్రభును వేడుకున్నారు. యేసుప్రభు చిత్రాలతో చర్చిని అలంకరించారు. చర్చి ఫాదర్ మానవాళిని మంచి కోసం యేసు శిలువ వేయించుకున్న రోజును గుడ్‌ఫ్రైడేగా పిలుస్తారన్నారు.

మురళీనగర్; గ్రేటర్ 50వవార్డు మురళీనగర్ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఆరాధనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ రాజశేఖర్ ఉపవాసకులకు శుభ వాక్యాలు తెలిపారు. ఏసుక్రీస్తు త్యాగ ఫలమే గుడ్ ఫ్రైడే సందేశమని పేర్కొన్నారు. ప్రభువు చూపిన శాంతి మార్గంలో అంతా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ సెక్టార్-8 బస్టాపు వదంద ప్రేయరు హాలు నుంచి ముందుగా ఉదయం శాంతి ప్రచారం చేపట్టారు. వీధుల్లో తిరిగి ఏసు బోధనలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో చర్చికమిటీ సభ్యులు ఉన్నారు. వందలాదిగా క్రీస్తు ఆరాధకులు హాజరయ్యారు.



అనకాపల్లిలో శుక్రవారం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు, బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్

వైసీపీ హయాంలో ఒక్క పరిశ్రమ రాలేదు

ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా జగన్‌కు కప్పం కట్టాల్సిన పరిస్థితులు

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం

రాజ్యసభ సభ్యుడు, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

అనకాపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఖర్మకాలి గత ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో అనేకమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని వదిలి పారిపోయారని రాజ్యసభ సభ్యుడు, అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ అన్నారు. తొలిసారిగా శుక్రవారం అనకాపల్లి వచ్చిన ఆయనకు బీజేపీ, తెలుగుదేశం, జనసేన నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగులాపల్లి రోడ్డులోని జేఎంజే స్కూల్ ఎదురుగా ఏర్పాటుచేసిన సభలో సీఎం రమేశ్ మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీగా గెలిపిస్తే పారిశ్రామికంగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాలేదని, ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా జగన్‌కు కప్పం కట్టాల్సిన పరిస్థితి తెచ్చారని ఆరోపించారు. గతంలో ఎన్‌డీఏ పాలనలో అనేక పరిశ్రమలు ఈ ప్రాంతానికి వస్తే, జగన్ పాలనలో ఒక్కటి కూడా రాలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టి ఓట్లేయించుకొని రాష్ట్రాన్ని మరింత దోచుకోవాలని జగన్మోహన్‌రెడ్డి చూస్తున్నారని సీఎం రమేశ్ ఆరోపించారు. విశాఖపట్నం ప్రాంతాన్ని గంజాయి కేంద్రంగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఆ దుర్మార్గుడిని దించి...చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అనేక సర్వే సంస్థలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో దోచుకున్న ప్రజా ధనాన్ని కక్కించి తీరుతామన్నారు. నరేంద్రమోదీ మూడోసారి పీఎం కావడం ఖాయమని, ఆయన చేసిన అభివృద్ధి పనులే మళ్లీ గద్దెనెక్కిస్తాయని జోస్యం చెప్పారు. ఈ సభలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, కూటమి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయ్‌కుమార్, పైలా ప్రసాదరావు, వంగలపూడి అనిత, తదితరులు పాల్గొన్నారు.

మోదీ మరోకసారి అధికారం చేట్టడం తథ్యం

-అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

సింహాచలం, మార్చి 29: కేంద్రంలో మరోకసారి నరేంద్రమోదీ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం ఆయన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ జరుగుతున్న సుదర్శన నారసింహ యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ అప్పన్నకు కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు చూపుతున్న అభిమానం చూస్తుంటే అనకాపల్లి స్థానం నుంచి తన విజయంతో పాటు కేంద్రంలో మోదీ సారథ్యంలో భాజపా ప్రభుత్వం మరోసారి పగ్గాలు చేపట్టడం ఖాయమన్న సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఆయన వెంట నగర భాజపా అధ్యక్షులు మేడపాటి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆ ధర్మచంద్రారెడ్డి

... 5వ పేజీ తరువాయి

లంచం డిమాండ్ చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో ఏసీబీ అధికారులు దాడులు చేసి మండల ఆర్ఐ, సర్వేయర్‌ను పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దారుగా ఉన్న ధర్మాచంద్రారెడ్డి ప్రమేయం కూడా ఉందన్న రైతు ఆరోపణల మేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ధర్మాచంద్రారెడ్డిపై కేసు ఎత్తివేసినట్టు రెవెన్యూ ఉద్యోగులు చెబుతారు. కాగా ధర్మాచంద్రారెడ్డి భీమిలి తహసీల్దారుగా పనిచేసే సమయంలో కాపులుప్పాడలో 27.44 ఎకరాల భూమిపై సకాలంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయలేదు. దాంతో ప్రభుత్వం నుంచి ఆ భూమి చేజారిపోయింది. అలాగే నగర నడిబొడ్డున సుమారు రెండు వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూములకు సంబంధించి ప్రభుత్వం తరఫున సకాలంలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయకపోవడానికి ధర్మాచందారెడ్డి ప్రధాన కారకులనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన విశాఖ అర్బన్ తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో దసపల్లా భూములపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టు తీర్పుచెప్పింది. దీనిపై సకాలంలో సుప్రీంకోర్టులో సవాల్ చేయకపోవడంతో వేల కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వం నుంచి చేజారిపోయాయి. ఈ వ్యవహారానికి బాధ్యుడిని చేస్తూ ధర్మాచంద్రారెడ్డిని అప్పుడు జిల్లా కలెక్టర్‌గా ఉన్న యువరాజ్ సస్పెండ్ చేశారు. ఆ తరువాత ఎందుచేతనో సస్పెన్షన్ ఎత్తివేశారు. ధర్మాచంద్రారెడ్డి నిర్లక్ష్యం వల్ల వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూములు ప్రభుత్వం కోల్పోవలసి వచ్చింది. దసపల్లా భూములు విషయంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ధర్మాచంద్రారెడ్డిని 2004లో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాపాడితే, ఇప్పుడు ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి సీఎం హోదాలో అభియోగాలను ఎత్తివేశారు.

భీమిలిపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల సమయంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించగా ఆ పార్టీలో చేరి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి సీనియర్ నాయకులైన దాడి వీరభద్రరావు (టీడీపీ), కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)లపై గెలిచారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున భీమిలి నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి కర్రి సీతారామ్‌పై 37 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు. గత 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బరిలో దిగి వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై పైచేయి సాధించి ఎమ్మెల్యే అయ్యారు. రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో మౌలిక వసతుల శాఖ మంత్రిగా, 2019లో చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో మానవ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఏనాడు కూడా ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీ చేయలేదు. అయితే తన రికార్డును తానే బ్రేక్ చేసుకొని ఈసారి భీమిలి నుంచి పోటీ చేయబోతున్నారు.

ఐపీఎల్ సందడి

... 5వ పేజీ తరువాయి

నిశాంత్ సింధు, రచిన్ రవీంద్ర, శార్దూల్ ఠాకూర్, దుషార్ దేశ్‌పాండే, తదితరులు ఉన్నారు. విమానాశ్రయం నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లేందుకు సీఎస్‌కే ఆటగాళ్లు బస్సు ఎక్కుతున్న సమయంలో అభిమానులు కేరింతలు కొట్టారు. ధోనీ...ధోనీ అని నినాదాలు చేశారు. కాగా, ఇప్పటివరకు జరిగిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి మూడో మ్యాచ్‌లో పాల్గొనేందుకు విశాఖ చేరిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై అభిమానులలో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా మహేంద్రసింగ్ ధోనీ అభిమానులు మ్యాచ్‌పై ఆసక్తిగా ఉన్నారు.

తిరిగి నగరానికి చేరిన ఢిల్లీ క్యాపిటల్స్

గురువారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు తిరిగి శుక్రవారం హోమ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు.. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో రాడిసన్ హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం సాయంత్రం నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

చెక్‌పోస్టు వద్ద రూ.3లక్షల నగదు స్వాధీనం

కంచరపాలెం, మార్చి 29 : కంచరపాలెం మెట్టు వద్ద గల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో రూ.3లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ.భాస్కరరావు తెలిపారు. దేవరాపల్లికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి బైక్‌పై జ్ఞానాపురం మీదుగా వస్తుండగా తనిఖీ చేయగా అతని వద్ద రూ.లక్ష, జగదాంబ ప్రాంతానికి చెందిన షణ్ముఖరావు కారులో రెండు లక్షలు నగదును పోలీసులు గుర్తించారు. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

నిర్మాణ సామగ్రితో దారిని మూసేశారు..

పాత గాజువాక చైతన్యనగర్‌లో ప్రధాన రహదారికి అడ్డంగా వేసిన ఇసుక, కంకర

తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, విద్యార్థులు



పాత గాజువాక చైతన్యనగర్‌లోని ప్రధాన రహదారిపై వేసిన ఇసుక, కంకర రాళ్లు

గాజువాక, మార్చి 29: నిత్యం విద్యార్థులు, ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే రహదారిని నిర్మాణ సామగ్రితో మూసివేయడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాత గాజువాకలోని చైతన్య నగర్ ప్రధాన రహదారుల్లో రహదారి పనుల నిమిత్తం ఇసుక, పిక్కరాళ్లను రెండు రోజుల క్రితం వేశారు. అయితే పనులు చేపట్టక ముందే నిర్మాణ సామగ్రిని వేయడం వల్ల ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానాపాట్లు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీల్లేకుండా పోయింది. ప్రధానంగా ఈ మార్గంలోనే పలు కళాశాలలు, పాఠశాలలు ఉండడంతో రోజూ వందలాది మంది విద్యారులు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఈ రోడ్డులో ఇసుక, కంకర రాళ్లను వేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్‌ను స్థానికులు నిలదీశారు. అయితే వారం రోజుల తర్వాత రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని కాంట్రాక్టరు బదులిచ్చినట్టు తెలిసింది. వారం తర్వాత పనులు ప్రారంభిస్తే.. అవి పూర్తయ్యేందుకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశం ఉంటుందని, అప్పటివరకు తమకు ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. నిర్మాణ సామగ్రితో రహదారిని మూసివేయడం భావ్యం కాదని, దీనిపై అధికారులు దృష్టిసారించి తగిన చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అదేవిధంగా గాజువాకలోని పలు వార్డుల్లో ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణదారులు ఇసుక, పిక్కరాళ్లు వంటి సామగ్రిని రహదారులపై డంపింగ్ చేస్తుండడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇసుక, ఇటుకలు, కంకర వంటి సామగ్రిని ఇష్టారాజ్యంగా రహదారులపై డంప్ చేస్తుండడం వల్ల ఒక్కోసారి ద్విచక్ర వాహనాలు స్కిడ్ అయి ప్రమాదాల బారిన పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే టీడీపీ ధ్యేయం

'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

పలు ప్రాంతాల్లో ఘనంగా 'దేశం' ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న 'పల్లా'

గాజువాక, మార్చి 29: ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ ముందుకు సాగుతుందని గాజువాక నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఇక్కడి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించాక మాట్లాడారు. టీడీపీ స్థాపించినప్పటి నుంచి ప్రజా సంక్షేమం కోసం రాజీ లేకుండా సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిక రాష్ట్రాన్ని అన్నివిధాల భ్రష్టు పట్టించిందన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీకి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాసరావు, నాయకులు శివప్రసాద్, వెంకటరావు, గోమాడ వాసు, నాగేశ్వరరావు, ఎ.దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు తమ నివాసంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే ప్రజాదరణతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని 59వ వార్డు పరిధి హిమాచల్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు తనయుడు మౌర్యసింహా పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశాక దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీని స్థాపించిన అనతికాలంలోనే అధికారంలోకి వచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్పొరేటర్ గల్లా చిన్న, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, నాయకులు రామ్మోహన్ నాయుడు, ఎం.శంకర్, కె.శ్రీను, ఎం.శ్రీను, సర్వసిద్ధి శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: పేదల భవిష్యత్తును తిరగ రాసేందుకే టీడీపీ ఆవిర్భవించిందని కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు అన్నారు. నడుపూరులో జరిగిన టీడీపీ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. నాయకులు బి.అప్పారావు, టి.సుదర్శనరావు పాల్గొన్నారు.



పాతగోపాలపట్నంలో ఆడారి ఆనంద్ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు



60వ వార్డులో ప్రచారంలో యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే వైసీపీ ధ్యేయం

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం, మార్చి 29: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గఅభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గ్రేటర్ 91వ వార్డు పాతగోపాలపట్నంలో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతిగడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. రానున్నఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైసీపీఅభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఏ రెహమాన్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, పేడాడ రమణికుమారి, వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్ పాలనలో శతశాతం హామీల అమలు : రమాకుమారి

మల్కాపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను శతశాతం నేరవేర్చి ప్రజల మన్ననలు పొందారని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. 60వ వార్డు ఇందిరాకాలనీ, అశోక్‌నగర్‌లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ తరపున ఆమె సోదరి పిల్లా రమాకుమారి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి మళ్లీ గెలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు జగన్‌మోహన్ రెడ్డిని తట్టుకులేక పొత్తుపెట్టుకుని వస్తున్నాయని విమరించారు. కార్పొరేటర్ పీవీ సురేశ్, వైసీపీ నగరప్రధాన కార్యదర్శి శరగడం పత్నీరావు, మండల క్లస్టర్ అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, వార్డు అధ్యక్షుడు ఆడారి హరీశ్, కనకమహాలక్ష్మి దేవస్థానం ధర్మకర్త మళ్ల ధనలత పాల్గొన్నారు.

వైసీపీలో జోరుగా చేరికలు..

ఎన్.ఎ.డి. జంక్షన్: మర్రిపాలెంలోని వైసీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 89వ వార్డుకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 50 మంది యువకులు వైసీపీనేత ఆళ్ల పైడి రాజు ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. వీరందరికి ఆడారి ఆనంద్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకురాలు పేడాడ రమణ కుమారి,పైడిరాజు, ఇతర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహగిరిపై కొనసాగుతున్న మహా యజ్ఞం



విన్నపాలు కావిస్తున్న వైదికులు

సింహాచలం, మార్చి 29 : సింహగిరిపై లోక కల్యాణార్థం చేపడుతున్న శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉభయ దేవేరులతో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు తొళ్లక్కిలో, యజ్ఞ భగవానుడు సుదర్శన పెరుమాళ్‌ను వేరే పల్లకిలో ఉంచి సింహగిరి మాడవీధుల్లో ఊరేగించి, యాగశాలలో ప్రత్యేక వేదికపై అధి ష్ఠింపజేశారు. తొలుత ముక్కోటి దేవతా నిలయమైన కపిలగోవును యాగ శాల ప్రాంగణంలో తిప్పి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాల జ్వాలాతోరణ పూజలు, పరివార హోమాలు చేసి చతుర్వేదాలు, స్త్రీ, పురుష సూక్తాలతో, నృసింహ, సుదర్శనమూర్తి మంత్రాలతో అక్షర లక్ష జపం, హోమం చేశారు. యాగంలో సుమారు 275 మంది ఉభయ దాతలు (జంట) పాల్గొనగా వారితో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర వైదిక సిబ్బంది పూజలు జరిపించారు. మధ్యాహ్నం హవనం తరువాత లఘు పూర్ణాహుతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, రాజ్యసభ సభ్యుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పాల్గొన్నారు. కాగా పూర్ణాహుతి తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి సన్నిధిలో విన్నపాలు విన్నవించారు.

గుడ్ ఫ్రైడే ప్రార్థనలు



వేపగుంటలో శిలువ వేషధారణలో ర్యాలీ



రామకృష్ణాపురంలో..

మల్కాపురం, మార్చి 29: గుడ్‌ఫ్రైడేను మల్కాపురం సెయింట్ జోసెఫ్ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవ సోదరులు శిలువ మోస్తూ క్రీస్తు గీతాలు ఆలపిస్తూ రామకృష్ణాపురం, మల్కాపురం పురవీధులలో తిరిగారు. ఈ కార్యక్రమంలో విచారణ గురువులు, కన్యస్త్రీలు, సంఘ ప్రజలు పాల్గొన్నారు. జనతాకాలనీ, రామకృష్ణాపురం, శ్రీహరిపురం, షిప్‌యార్డు కాలనీల్లోనూ గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు.

గోపాలపట్నం: స్థానిక లక్ష్మీనగర్‌లోని లైఫ్ చేంజింగ్ సెంటర్, జయప్రకాశ్‌నగర్‌లోని ఎరుషలేము చర్చిలలో జరిగిన గుడ్ ఫ్రైడే ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ఎరుషలేము చర్చిలో సంఘ కాపరి ఏంజిల్ బ్లెస్సీ గుడ్ ఫ్రైడే సందేశాన్ని వినిపించారు.లైఫ్ చేంజింగ్ సెంటర్ సిస్టర్ షీలాపాల్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఉపవాసం దీక్షలను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

పెదగంట్యాడ: బాలచెరువు, హౌసింగ్ బోర్డు, సత్యనారాయణపురం, గంగవరం, భానోజీతోట, దయాళ్‌నగర్ ప్రాంతాల్లోని చర్చిలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పార్థనలు చేశారు. బాలచెరువు రేమా బ్లెస్సింగ్ చర్చిలో నిర్వాహకులు ఎం.పెంటయ్య క్రీస్తు సందేశాన్ని వివరించారు. ఆయా చర్చిలలో క్రైస్తవులు భక్తి గీతాలను ఆలపించారు. పెదగంట్యాడ కూడలిలో సీయోను ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించగా, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, టీడీపీ నాయకుడు పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: వేపగుంట ముత్యాలమ్మ కాలనీ బైబిల్ మిషన్ సమృద్ధి గృహంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వేపగంట కూడలి వరకు శిలువ మోస్తున్న వ్యక్తి వేషధారణ ర్యాలీగా వెళ్లారు. రెవరెండ్ ఫాదర్ సి.హెచ్. సుందరరావు క్రైస్తవ సోదరుల ను ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీసు మానవుల పాప నివారణకు ఎన్నో బాధలు భరించారని పేర్కొన్నారు.



బాలచెరువు రేమా బ్లెస్సింగ్ చర్చిలో



గోపాలపట్నంలో..



సీఎం రమేశ్‌కు స్వాగతం పలికిన కరణంరెడ్డి నరసింగరావు, తదితరులు

సీఎం రమేశ్‌కు ఘన స్వాగతం

గాజువాక, మార్చి 29: అనకాపల్లి పార్లమెంటు బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి సీఎం రమేశ్‌కు శుక్రవారం పాత గాజువాకలో భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని, ప్రధాని మోదీ చేపట్టే ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళతామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాట శ్రీను, బొండా యల్లాజీరావు, పద్మ, భువనేశ్వరి, నాగేశ్వరరావు, మణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

కేవీలో అడ్మిషన్లు చేపట్టాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 29: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతి అడ్మిషన్‌లు ప్రారంభించాలని కోరుతూ సీజీఎం (హెచ్‌ఆర్) గాంధీని కార్పొరేటర్ గంగారావు కోరారు. శుక్రవారం ప్లాంట్‌లో సీజీఎంతో సమావేశమై ఈ ఏడాది అడ్మిషన్‌లు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని, ఎంతో మంది విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్ ప్రక్రియ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. దీనిపై సీజీఎం సానుకూలంగా స్పందిచారని ఆయన తెలిపారు. ఉక్కు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు ఇవ్వాలని వినతి

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 29: ఉక్కు ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని కోరుతూ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు నేతృత్వంలో నాయకులు శుక్రవారం ఉక్కు ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేశారు. గత కొన్ని నెలలుగా జీతాలును యజమాన్యం సక్రమంగా చెల్లించకపోవటం వలన చాలా ఇబ్బందులు పడుతున్నామని, బ్యాంకులకు డిఫాల్ట్‌గా మారామన్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కూర్మన్నపాలెం, మార్చి 29: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కాళింగుల వీధిలో కార్తికేయ శ్రీస్వర్ణాకర్షణ భైరవ, భువనేశ్వరి దేవి సహిత, పంచముఖేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనను గ్రామ పెద్దలు, కాలనీ వాసుల సమక్షంలో శుక్రవారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో 'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్, సింహాద్రి ప్రాపర్టీస్ చైర్మన్ సిగిలిపల్లి రవి, గ్రామ పెద్దలు పి.వేణుబాబు, విజయలక్ష్మి, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్‌లేక పాట్లు



పెందుర్తిలో ఎండలో నిల్చున్న ప్రయాణికులు

పెందుర్తి, మార్చి 29: స్థానిక బీఆర్టీఎస్ మార్గం ప్రధాన కూడలిలో బస్ షెల్టర్ లేక ప్రయాణికులకు ఎండలోనే రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో వివిధ కారణాలతో బీఆర్టీఎస్ రహదారి విస్తరణ నిలిచిపోయింది. ఫలితంగా బస్టాప్ ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. స్టాప్ లేకపోవడంతో బస్సులు ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి. ఒక్కోసారి బస్సు అందుకోవాలన్న ఆత్రుతలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీనికితోడు ఆటోలు రహదారికి అడ్డంగా పరుగుతీస్తుండడంతో బస్సుల కోసం వేచి ఉన్న వారు భీతిల్లుతున్నారు. షెల్టర్ లేక ఎండైనా, వర్షం వచ్చిన రోడ్డుపై నిరీక్షించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి షెల్టర్ నిర్మించాలని కోరుతున్నారు.

సినిమా గైడ్

- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శారద, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్, మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి)
- **ఆడుజీవితం :** శ్రీలీలామహల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఓం భీం బుష్ :** సంగం, కామేశ్వరి, రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజవాక), తాతా (తగరపువలస)
- **ప్రేమలు :** శ్రీకన్య, దుర్గ (మధురవాడ), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 18, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారెట్ 26, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 150, బరబాటి 30, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 140, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 44, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10లో..



ప్రచారంలో పాల్గొన్న శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు, తదితరులు

వైసీపీ పాలనలో 20 ఏళ్లు వెనక్కివెళ్లిన రాష్ట్రం

విశాఖ ఉమ్మడి లోక్‌సభ అభ్యర్థి శ్రీభరత్

అక్కిరెడ్డిపాలెం, మార్చి 29: వైసీపీ పాలనలో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని టీడీపీ, జనసేన, బీజేపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా టీడీపీకే ఉందన్నారు. శుక్రవారం అక్కిరెడ్డిపాలెం పంచవటి కాలనీలో ఆయనతో పాటు పల్లా శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ముందుగా పంచవటి కాలనీలోని విజయగణపతి ఆలయంలో వారు పూజలు చేశారు. అనంతరం ప్రచారంలో పాల్గొన్న వారికి అడుగడుగునా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎంపీగా తనను, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్లాను గెలిపించాలని శ్రీభరత్ కోరారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతిని దృష్టిలో పెట్టుకుని ప్రజలంతా ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పంచవటి కాలనీ, వివేకనందకాలనీ, అక్కిరెడ్డిపాలెం కాలనీలలో వారు ప్రచారం సాగించారు. ఈ ప్రచారంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాస్, బొండా జగన్, నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, పులి వెంకటరమణారెడ్డి,గడసాల అప్పారావు, ఎం.షాలిని, బి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి వైసీపీకి చరమగీతం పాడాలి

అగనంపూడి: కక్ష సాధింపు చర్యలు, అవినీతి, దౌర్జన్యాలు, దోపిడీలతో పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి త్వరలో జరగనున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఫార్మాసిటీ కాలనీలో శుక్రవారం ఆయన జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దుల్ల రామునాయుడు, నాయకులు కర్రి దశేంద్ర, గౌరినాయుడు, త్రినాథ్, సోమశేఖర్, డి.రమేశ్, జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం వార్డు కమిటీ సమావేశంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉమ్మడి నాయకత్వంతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమన్నారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సర్వసిద్ధి అనంతలక్ష్మి, శీరం రాజేశ్, డి.అప్పలరాజు, బి.రమణ, వి.జీవన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వ స్థాపనే ధ్యేయంగా అందరూ పనిచేయాలని 'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు కోరారు. 75వ వార్డులో జరిగిన మూడు పార్టీల కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాక్షస పాలన నుంచి ప్రజలు విముక్తి పొందాలంటే ఉమ్మడి పార్టీల ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, ఉమ్మడి నాయకులు ఎస్.అప్పారావు, ఎస్.వెంకటరమణ, ఎమసేన్‌రావు, పైడియ్య రమణబాబు, దుర్గబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం



ఉక్కుటౌన్‌షిప్, మార్చి 29: స్టీల్ ప్లాంట్ త్రిశక్తి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం,దీక్షాధారణ, తదితర పూజాది కార్యక్రమాలను ప్రధానార్చకులు ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్లను టౌన్‌షిప్‌లో ఊరేగించగా, మహిళలు కోలాటాలు, భజనలు చేశారు. మరో రెండు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు.

71వ వార్డులో వినాయక మందిర వార్షికోత్సవం

శ్రీనగర్: జీవీఎంసి 71వ వార్డు అఫీషియల్ కాలనీలో సంపత్ వినాయక మందిర 15వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాన అర్చకులు ప్రదీప్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, వార్షిక సంకల్పం,దీక్షా ధారణ, తదితర పూజలు, అర్చనలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ వార్షికోత్స పోస్టర్ ఆవిష్కరణ

ఆటోనగర్: జీవీఎంసీ 70 వార్డు పరిధి ఎల్‌వీనగర్‌లో నూకాంబిక ఆలయ తృతీయ వార్షికోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను గ్రామ, ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యుడు వి.రాజారావు మాట్లాడుతూ ఏప్రిల్ ఎనిమిదిన అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, పరస నిర్వమిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లంకల మురళీ దేవి, కేవీ సూరిబాబు, టి.చిరంజీవి, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తుకు టీడీపీ కూటమిని గెలిపించండి

» పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి గణబాబు



ప్రచారంలో మాట్లాడుతున్న గణబాబు

ఆర్పీపేట, (కంచరపాలెం), మార్చి 29: రాష్ట్ర భవిష్యత్తుకోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. గ్రేటర్ 57వార్డు పరిధి ఆశవానిపాలెంలో బీజేపీ, జనసేన నాయకులతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అన్నీ వర్గాల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ అమలు చేయక లేక నిరుద్యోగులకు ఉపాధి కరువైందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలంతా ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని ఎదురుచూస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలతో ప్రతి ఒక్కరికీ భరోసా కల్పించే బాధ్యత చంద్రబాబు తీసుకుంటారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన టిడ్కో ఇళ్లను మళ్లీ లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. దోచుకోవడం, ప్రశ్నించేవారిపై దాడులు చేయడం వైసీపీ నాయకులు ధోరణిగా మారిందన్నారు. జగన్ పాలనలో మహిళలు, బడుగు, బలహీన వర్గాలకు రక్షణ కరువైందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. ఆ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, కిల్లి శ్రీరాంమూర్తి, నాగుల అప్పలరాజు, టాస్ హరితో పాటు స్థానిక నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల పరిశీలన

సాగర్‌నగర్, మార్చి 29 : అటవీ శాఖ విశాఖ సర్కిల్ పర్యటనలో భాగంగా ఆ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి శుక్రవారం సాగర్‌నగర్‌తో పాటు పలు అటవీ ప్రాంతాలను పరిశీలించారు. భీమిలి పరిధిలోని సాగర్‌నగర్‌తో పాటు ఎక్కడెక్కడ అటవీ శాఖ భూములు ఉన్నాయో చూశారు. కంబాలకొండ టీడీసీ, తూర్పు కనుమల జీవన వైవిధ్య కేంద్రం, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు, ఔషధ వనాలు, నక్షత్ర వనం, తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సాగర్‌నగర్ బీచ్‌లో ఎకో టూరిజం అభివృద్ధి చేయడా నికి ప్రతిపాదనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీకంఠనాథ్‌రెడ్డి, బీఎఫ్ఓ అనంత్ శంకర్, సబ్ డీఎఫ్ఓ ధర్మ్ రక్షిత్, అటవీ శాఖ అధికారి రామ్‌నరేష్, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి అభ్యర్థిగా గంటా ఎంపికపై హర్షం



గంటాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పాలమరశెట్టి శ్రీను

మద్రిపాలెం, మార్చి 29: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావును పేరు అధిష్ఠానం ప్రకటించడంతో ఆపార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈసందర్భంగా గంటాను పార్టీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాలమరశెట్టి శ్రీనివాసరావు తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

7 తులాల బంగారం అపహరణ

వేపగుంట మార్చి 29: జీవీఎంసీ 98వ వార్డు శివారు ప్రాంతాల్లో వరుస చోరీలతో జనాలు బెంబేలెత్తిపోతున్నారు. అప్పన్నపాలెంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగి దాదాపు 7 తులాల బంగారం, 150 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుపోయారు. వివరాలి.. ఈ ఇంట్లో ఉన్న మిలట్రీలో పనిచేసి పదవీ విరమణ చేసిన వీవీఎస్ ఆచార్యులు, కామాక్షి దంపతులు కాశీ, అయోధ్య తీర్థయాత్రలకు పదిరోజుల కిందట వెళ్లారు. ఈ క్రమంలో చోరీ జరిగింది.

ఆస్తి పన్ను చెల్లింపునకు బారులు

జ్ఞానాపురం, మార్చి 29: ఆస్తిపన్ను, ఖాళీస్థలాల పన్నును వడ్డీ లేకుండా చెల్లింపునకు మార్చి 31 ఆఖరు తేదీ కావడంతో పన్ను చెల్లింపుదారులు జ్ఞానాపురంలోని సౌకర్యం కేంద్రం ఎదుట క్యూ కట్టారు. వారికి ఇబ్బందులు కలుగకుండా మరో ప్రత్యేక కౌంటర్, తాగునీటి సదుపాయం ఏర్పాటుచేసినట్టు జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ ఈసందర్భంగా తెలిపారు. ప్రభుత్వం 31వ తేదీలోగా చెల్లించేవారందరికీ వడ్డీ మాఫీ చేస్తోందన్నారు. ఆదివారం కూడా ఈ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజకీయాల్లో డబ్బు ప్రమేయం తగ్గాలి

జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



ప్రచారంలో జేడీ లక్ష్మీనారాయణ, కొణతాల

సీతంపేట, మార్చి 29: రాజకీయాల్లోకి మంచి వ్యక్తులు రావాలని, డబ్బు ప్రమేయం తగ్గాలని జై భారత్ పార్టీ వ్యవస్థాపకులు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ఉత్తర నియోజక వర్గంనుంచి పోటీ చేస్తున్న ఆయన ఎన్నికల ప్రచారాన్ని సీతంపేటలోని దుర్గాగణపతి ఆలయం నుంచి ప్రారంభించారు. తొలుత ఆయనకు స్థానిక మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికి తిలకం దిద్దారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత ఎన్నికల్లో విశాఖ ఎంపీ స్థానానికి పోటీ చేశానన్నారు. ఈసారి తనకు ఉత్తర నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం ఉందని అన్నారు. విశాఖ దక్షిణం నుంచి తమ పార్టీ తరపున అభ్యర్థిని నిలుపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొణతాల రామకృష్ణ పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

సీతంపేట, మార్చి 29: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. మహారాణిపేట, అక్కయ్యపాలెం, డొండపర్తి ప్రాంతాల్లో అనుమానిత వాహనాలను స్టేషన్‌కి తరలించారు.

వైసీపీ నేతలకు రామవరం లేఅవుట్!?

... 5వ పేజీ తరువాయి

నిర్ణయించారు. రామవరం, గంగసాని అగ్రహారం లేఅవుట్లలో గజం రూ.14 వేలు ధర పెట్టారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎంఐజీలో 20 శాతం రాయితీ ఇస్తామన్నారు. ప్లాట్ల సంఖ్యలో 10 శాతం రిజర్వేషన్ కూడా ప్రకటించారు.

రామవరం ఆకట్టుకోవడంతో నిలిచిన అమ్మకాలు

రామవరంలో వేసిన లేఅవుట్ జాతీయ రహదారికి సమీపాన రాకపోకలకు అనుకూలంగా ఉండడం, పరిసరాలు కూడా త్వరగా అభివృద్ధి చెందే అవకాశం ఉండడంతో వైసీపీ పెద్దల కన్ను పడింది. ఈ లేఅవుట్‌లో ప్లాట్లను అమ్మవద్దని, భవిష్యత్తు అవసరాల పేరుతో పక్కన పెట్టాలని ఆదేశించారు. చెప్పిందే తడవుగా ఆ లేఅవుట్‌లో అమ్మకాలు నిలిపివేశారు. అన్ని లేఅవుట్లను ఒకేసారి అభివృద్ధి చేయడం కష్టమని, ఒక్కొక్కటి చేసుకుంటూ వస్తామని కొత్త పల్లవి అందుకొని ముందుగా పాలవలసలో ప్లాట్లు కేటాయిస్తామంటూ అక్కడి నుంచి అమ్మకాలు ప్రారంభించారు. రామవరానికి పెద్దగా డిమాండ్ లేదని, తక్కువ దరఖాస్తులు వచ్చాయని చెప్పి ఆ లేఅవుట్‌ను వైసీపీ పెద్దల కోసం పక్కన పెట్టేశారు.

రామవరం లేఅవుట్ కోసం 75 మంది రైతుల నుంచి సర్వే నంబర్లు 141 నుంచి 154 వరకు మొత్తం 119.22 ఎకరాలు సేకరించారు. 240 గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్లు 222, 200 గజాల విస్తీర్ణం కలిగినవి 160, 150 గజాల విస్తీర్ణంతో 381 ప్లాట్లు వేశారు. ఇవి కాకుండా అంతకంటే చిన్న పరిణామం కలిగిన ప్లాట్లు మరో 106 వేశారు. మొత్తం 869 ప్లాట్లతో రూపొందించిన లేఅవుట్‌లో అమ్మకాలు ఆపేసి వైసీపీ పెద్దల కోసం రిజర్వు చేసేశారు. మొత్తం నాలుగు లేఅవుట్లలో 2,310 ప్లాట్లు కాగా అందులో అత్యధికం 869 రామవరంలోనే ఉండడం గమనార్హం.

నత్తనడకన పనులు

లేఅవుట్లను అన్నిరకాల మౌలిక వసతులతో అభివృద్ధి చేస్తామని ప్రకటించిన వీఎంఆర్‌డీఏ అధికారులు ఆ పనులు ఏవీ చేయడం లేదు. అలా చేస్తే వాటికి డిమాండ్ పెరిగి కొనుగోలుదారులు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తారని కావాలనే జాప్యం చేస్తున్నారు. ఇప్పటికే ముందుకువచ్చిన వారి నుంచి డబ్బులు వసూలుచేసి వాటితోనే నామమాత్రపు పనులు చేస్తున్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే...విశాఖను రాజధానిగా చేసుకొని పరిపాలన చేస్తుందని, అప్పుడు భూముల విలువ మరింత పెరుగుతుందని, అప్పుడు ఈ రామవరం లేఅవుట్‌ను ఉపయోగించుకోవాలనే ఆలోచనతోనే ఆ పార్టీ పెద్దలు మొత్తం రిజర్వు చేసుకున్నారని వీఎంఆర్‌డీఏ వర్గాలు చెబుతున్నాయి. అందుకే అక్కడ అమ్మకాలు నిలిపివేశారని స్పష్టంచేశాయి.

బొగ్గు లారీ బీభత్సం

... 5వ పేజీ తరువాయి

ప్రమాదంలో బొగ్గు లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్‌తోపాటు ఇతర వాహనాల్లో ప్రయాణిస్తున్న చీడికాడ మండలం చుక్కపల్లికి చెందిన కె.సంతోషి, కె.వెంకటరమణ, పాత గాజువాకకు చెందిన బి.శరణ్య, అగనంపూడికి చెందిన వల్లా శ్రీను, జి.హర్ష, జి.కొండయ్య డి.శ్రీనివాసరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. లారీ డ్రైవర్ నిరాజ్‌లాల్, డి.శ్రీనివాసరాజు, కె.వెంకటరమణల పరిస్థితి ఆందోళనకరంగా వుందని పోలీసులు తెలిపారు. ప్రమాదం కారణంగా గాజువాక నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పరవాడ పోలీసులు సంఘటనా స్థలికి చేరుకొని ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సాయంతో సుమారు గంటపాటు శ్రమించి తొలగించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పరవాడ పోలీసులు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకం

- ఉన్నత పాఠశాలలో 3,4,5 తరగతులు విలీనం
- 1,2 తరగతులతోనే ప్రైమరీ స్కూళ్లు
- నివేదిక పంపాలని కోరిన పాఠశాల విద్యాశాఖ
- కోడ్ ఉన్నా పట్టించుకోని అధికారులు

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారేలా ఉంది. ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోబోతోంది. దీంతో ప్రాథమిక పాఠశాలలు కేవలం 1,2 తరగతులకే పరిమితం కానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేయడంతో అధికారులు జీవీఎంసీ పరిధిలో ఉన్నత పాఠశాలలకు ఒక కి.మీ. పరిధిలో గల ప్రాథమిక పాఠశాలల వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ఇటువంటి ప్రక్రియ చేపట్టకూడదని తెలిసినా పట్టించుకోవడం లేదు.

విద్యార్థులు, తల్లిదండ్రులు వ్యతిరేకించినా రెండేళ్ల క్రితం జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసేశారు. దీంతో ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం పడింది. విద్యాశాఖ అధికారులు వివరాలు చెప్పకపోయినా గత ఏడాదితో పోల్చితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది.

అయితే రెండేళ్ల క్రితం తరగతుల విలీనానికి సంబంధించి విద్యాశాఖ జీవో 117, 128, 60 జారీచేసినప్పుడు మునిసిపల్ పాఠశాలలు మునిసిపల్ పరిపాలన శాఖ పరిధిలో ఉండడంతో 3,4,5 తరగతుల విలీనం జరగలేదు. ఇటీవల మునిసిపల్ పాఠశాలలను విద్యాశాఖ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో టీచర్ల రేషనలైజేషన్, 3,4,5 తరగతుల విలీన ప్రక్రియ తెరపైకి తీసుకువచ్చి మునిసిపల్ పాఠశాలలకు వర్తించేలా ఆదేశాలు ఇచ్చారు. తాజా ఆదేశాల మేరకు జీవీఎంసీలోని ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి నుంచి అనకాపల్లి వరకు విస్తరించి ఉంది. మొత్తం 115 ప్రాథమిక పాఠశాలలు ఉండగా సుమారు పది వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీటిలో ఉన్నత పాఠశాలలకు ఒక కి.మీ. దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలు ఎన్ని?, అక్కడ 3,4,5 తరగతులు ఎంతమంది చదువుతున్నారు?, టీచర్ల ఎంతమంది?...అనే వివరాలు సేకరించి తక్షణమే పంపాలని విద్యా శాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమాచారం మేరకు సీతమ్మధారలోని నెహ్రూ మునిసిపల్ ఉన్నత పాఠశాలకు కి.మీ. దూరంలో నక్కవానిపాలెం, మద్దిలపాలెం ప్రాథమిక పాఠశాలలు, మాధవధార ఉన్నత పాఠశాలకు సమీపంలో మాధవధారలో రెండు స్కూళ్లు ఉన్నాయి. మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులు మొత్తమ్మీద సుమారు ఆరు వేల వరకు విద్యార్థులు ఉంటారని టీచర్లు అంచనా వేస్తున్నారు. విలీనం తరువాత కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేద్కర్ పేర్కొన్నారు. తరగతుల విలీన ప్రక్రియను తక్షణం నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

జీవో 17తో ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్

డాబాగార్డెన్స్, మార్చి 29: నూతన విద్యా విధానం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వల్ల ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం ఓ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడేళ్లుగా జీతాలు తప్ప మిగిలిన ఏ బిల్లులుచెల్లించకపోవడంతో రూ.21వేల కోట్ల మేర ఉపాధ్యాయులకుబకాయిలు పేరుపోయాయమన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ రామిరెడ్డి . రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మావతి, దేముడుబాబు, పైడిరాజు, రవి, పరదేశి, శేషగిరిరావు, వరలక్ష్మి, ప్రభాకర్, రాజుపాల్గొన్నారు..

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార: విద్యుత్ స్తంభాల మార్పు నేపథ్యంలో శనివారం ఉదయం 9నుంచి సాయంత్రం 6 వరకు గాంధీనగర్ ఏరియా, ఎం ఆర్వో ఆఫీస్ ఏరియా, పోస్టు ఆఫీస్ ప్రాంతం, దొర ఆసుపత్రి, బే ఫేషన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను జోన్-1 ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

సంజీవయ్య కాలనీలో..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సంజీవయ్య కాలనీలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.

'కూటమి గెలుపునకు కృషి'



విష్ణుకుమార్‌రాజుకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

మురళీనగర్, మార్చి 29; జనసేన, బీజేపీ, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా విశాఖ ఉత్తరం నుంచి పోటీచేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెన్మెత్స విష్ణుకుమార్‌రాజు విజయం కోసం రాజీలేకుండా శ్రమిస్తామని జనసేన ఉత్తర నియోజకవర్గ నాయకులు సంకు. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగృహానికి విచ్చేసిన విచ్చేసిన విష్ణుకుమార్ రాజుకి సాదర స్వాగతం పలికారు. విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ వైసీపీ నార్త్ అభ్యర్థి కేకే రాజు అతివిశ్వాసాన్ని అణచివేసేలా ప్రజలు తీర్పునివ్వాలన్నారు. నాయకులందరిఅండదండలతో తాను నియోజకవర్గ అభివృద్ధికి మరింతగా శ్రమిస్తానని ఈసందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన డాక్టర్స్ సెల్ కన్వీనర్ బి.రఘు, టీడీపీ సీనియర్ నాయకులు సనపల.వరప్రసాద్ ఉన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ శ్రావణి, ఆయా పార్టీల నాయకులు

అక్కయ్యపాలెం, మార్చి 29 : బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం టీడీపీని ఎన్టీరామారావు ప్రారంభించారని ఆ పార్టీ నేతలు అన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రేటర్ 26, 27 వార్డుల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా వార్డుల టీడీపీ, బీజేపీ, జనసేన అధ్యక్షులు, నాయకులు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ వ్యవస్థాపకులు తారక రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచారు. 26వ వార్డు చిన్నూరులోని పార్టీ కార్యాలయంలో వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు బండి కన్న, సీతమ్మధార మండల బీజేపీ అధ్యక్షుడు నాగడమూడి నానాజీ తదితరులు పాల్గొన్నారు. 27వ వార్డులో కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి. లక్ష్మీ శివప్రసాద్ పాల్గొన్నారు.

గండిబాబ్జీకి అభినందనలు

డాబాగార్డెన్స్: టీడీపీ విశాఖ దక్షిణ నియోజక వర్గ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆపార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు నూతనంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా గండిబాబ్జీని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తామని ఈసందర్భంగా అన్నారు.

వాల్తేరు డివిజన్ మరో రికార్డు

- ఆర్థిక సంవత్సరంలో 75 మిలియన్ టన్నుల సరకు రవాణా
- గత ఏడాది 69.6 మిలియన్ టన్నుల మాత్రమే

విశాఖపట్నం, మార్చి 29 (ఆంధ్రజ్యోతి):

వాల్తేరు రైల్వే డివిజన్ మరో రికార్డును నెలకొల్పింది. ఇప్పటివరకూ ఎన్నడూ లేనంత స్థాయిలో సరకు రవాణా చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి 26వ తేదీ నాటికే 75 మిలియన్ టన్నుల మార్కును దాటేసింది. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో 69.6 మిలియన్ టన్నుల మాత్రమే సరకును చేరవేసింది. ఈసారి ఐదు రోజుల వ్యవధి ఉండగానే 75.64 మిలియన్ టన్నులు రవాణా చేసింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అనేక ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ, అభివృద్ధి పనుల పేరుతో కొన్ని లైన్లలో రైళ్లను నిలిపివేసినప్పటికీ ఈ రికార్డును సాధించడం ఆనందంగా ఉందని, ఇదంతా సిబ్బంది సమన్వయంతోనే సాధ్యమైందని డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ వెల్లడించారు.

అత్యధికం ముడి ఇనుమే



మాట్లాడుతున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

వాల్తేరు డివిజన్ నుంచి అత్యధికంగా ముడి ఇనుము (ఐరన్‌ఓర్) రవాణా అవుతుంది. కొత్తవలస-కిరండోల్ మార్గంలో దీనిని తీసుకువస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో 22.88 మిలియన్ టన్నుల ఐరన్‌ఓర్ రవాణా చేశారు. ఇది గత ఏడాది చేసిన 22.66 మిలియన్ టన్నుల కంటే 22.4 శాతం అధికం. స్టీల్‌ప్లాంటుకే 4.19 మిలియన్ టన్నులు రవాణా చేశారు. ఇతర సరకులు చూసుకుంటే కోల్, కోక్ కలిపి 25.2 మి.టన్నులు, బాక్సైట్ 5.52 మి.టన్నులు, అల్యూమినా 3.77 మి.టన్నులు, ఐరన్ అండ్ స్టీల్ 3.2 మి.టన్నులు, శ్లాగ్, కాస్టిక్ సోడా, జిప్సమ్, కంటెయినర్ కార్గో తదితరాలు కలిపి 12.3 మి.టన్నులు రవాణా చేశామన్నారు. ఫొటోలు రైల్వే అని ఉన్నాయి.

ఆగిఉన్న లారీని ఢీకొన్న కారు

- ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

ఎలమంచిలి, మార్చి 29: మండలంలోని పులపర్తి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారు జామున రెండు గంటల ప్రాంతంలో ఆగి ఉన్న లారీని, వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైనట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. ఈ ప్రమాదంలో విశాఖపట్నంకు చెందిన మైలపల్లి వెంకట శివకుమార్(45) మృతి చెందగా, విశాఖకు చెందిన బీవీఎస్. కృష్ణ, కె.దీరకుమార్‌లకు తీవ్ర గాయాలైనట్టు తెలిపారు. పులపర్తి జంక్షన్ సమీపంలో తుని నుంచి విశాఖ వైపు వస్తూ ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ టీ తాగేందుకు రోడ్డు పక్కన నిలిపారు. ఇదే సమయంలో భీమవరం నుంచి విశాఖ వైపు ప్రయాణిస్తున్న కారు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈప్రమాదం జరిగింది. క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. వీరిలో కారు డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న శివకుమార్ ఆస్పత్రిలో మృతి చెందగా.. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు విశాఖలోని వైభవ్ జ్యూయలర్స్ ప్రధాన బ్రాంచిలో పనిచేస్తుంటారని, కార్యాలయ పని మీద భీమవరం వెళ్లి తిరిగి విశాఖ వస్తుండగా ప్రమాదానికి గురైనట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ సింహాచలం తెలిపారు.



జ్ఞానాపురంలోని రక్షణగిరిపై ప్రార్థనలు..



గుడ్‌ఫ్రైడేలో పాల్గొన్న విశ్వాసులు

త్యాగధనుడు ఏసుక్రీస్తు

- జ్ఞానాపురం చర్చిలో భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- క్రీస్తు శిలువ మోస్తూ వేషధారణలో ఊరేగింపు

జ్ఞానాపురం, మార్చి 29: సర్వమానవాళి పాపవిమోచనకు ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేసిన రోజే గుడ్ ఫ్రైడే అని రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాష్ అన్నారు. గుడ్ ఫ్రైడే ను పురస్కరించుకు శుక్రవారం జ్ఞానాపురం రక్షణగిరిపై పునీతపేతురు ప్రధాన దేవాలయంలో విచారణకర్త ప్రకాష్ నేతృత్వంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేలాది మంది విశ్వాసులు తరలివచ్చి క్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ సర్వజన రక్షణ కోరుతూ కన్నీటితో విచారణకర్తలు, గురువులు, మఠవాసులు, దీక్షాపరులు దేవమాత గుహ నుంచి రక్షణగిరి కొండపైకి పరిశుద్ధ శిలువ మార్గాన్ని నిర్వహించారు. క్రీస్తు త్యాగాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 విగ్రహాల వద్ద ప్రార్థించారు. అనంతరం పునీతపుతేరు దేవాలయం వద్ద ఫాదర్ మల్లవరపు ప్రకాష్ దివ్యబలిపూజ జరిపారు. సందేశాన్ని వినిపించారు.

సీతమ్మధారలో...

సీతమ్మధార, మార్చి 29: సీతమ్మధారలోని బాలయేసు చర్చిలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ప్రార్థనలుచేస్తూ గీతాలు ఆలపించారు. భక్తులు మోకరిల్లి యేసుప్రభును వేడుకున్నారు. యేసుప్రభు చిత్రాలతో చర్చిని అలంకరించారు. చర్చి ఫాదర్ మానవాళిని మంచి కోసం యేసు శిలువ వేయించుకున్న రోజును గుడ్‌ఫ్రైడేగా పిలుస్తారన్నారు.

మురళీనగర్; గ్రేటర్ 50వవార్డు మురళీనగర్ సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ చర్చిలో శుక్రవారం గుడ్ ఫ్రైడే ఆరాధనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ రాజశేఖర్ ఉపవాసకులకు శుభ వాక్యాలు తెలిపారు. ఏసుక్రీస్తు త్యాగ ఫలమే గుడ్ ఫ్రైడే సందేశమని పేర్కొన్నారు. ప్రభువు చూపిన శాంతి మార్గంలో అంతా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ సెక్టార్-8 బస్టాపు వదంద ప్రేయరు హాలు నుంచి ముందుగా ఉదయం శాంతి ప్రచారం చేపట్టారు. వీధుల్లో తిరిగి ఏసు బోధనలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో చర్చికమిటీ సభ్యులు ఉన్నారు. వందలాదిగా క్రీస్తు ఆరాధకులు హాజరయ్యారు.



అనకాపల్లిలో శుక్రవారం నిర్వహించిన సభలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు, బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్

వైసీపీ హయాంలో ఒక్క పరిశ్రమ రాలేదు

ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా జగన్‌కు కప్పం కట్టాల్సిన పరిస్థితులు

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం కానివ్వం

రాజ్యసభ సభ్యుడు, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

అనకాపల్లి, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఖర్మకాలి గత ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో అనేకమంది పారిశ్రామికవేత్తలు రాష్ట్రాన్ని వదిలి పారిపోయారని రాజ్యసభ సభ్యుడు, అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ అన్నారు. తొలిసారిగా శుక్రవారం అనకాపల్లి వచ్చిన ఆయనకు బీజేపీ, తెలుగుదేశం, జనసేన నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాగులాపల్లి రోడ్డులోని జేఎంజే స్కూల్ ఎదురుగా ఏర్పాటుచేసిన సభలో సీఎం రమేశ్ మాట్లాడుతూ అనకాపల్లి ఎంపీగా గెలిపిస్తే పారిశ్రామికంగా ఈ ప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాలేదని, ఉన్న పారిశ్రామికవేత్తలు కూడా జగన్‌కు కప్పం కట్టాల్సిన పరిస్థితి తెచ్చారని ఆరోపించారు. గతంలో ఎన్‌డీఏ పాలనలో అనేక పరిశ్రమలు ఈ ప్రాంతానికి వస్తే, జగన్ పాలనలో ఒక్కటి కూడా రాలేదన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టి ఓట్లేయించుకొని రాష్ట్రాన్ని మరింత దోచుకోవాలని జగన్మోహన్‌రెడ్డి చూస్తున్నారని సీఎం రమేశ్ ఆరోపించారు. విశాఖపట్నం ప్రాంతాన్ని గంజాయి కేంద్రంగా మార్చిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ఆ దుర్మార్గుడిని దించి...చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. ఈ విషయాన్ని అనేక సర్వే సంస్థలు చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వచ్చాక జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో దోచుకున్న ప్రజా ధనాన్ని కక్కించి తీరుతామన్నారు. నరేంద్రమోదీ మూడోసారి పీఎం కావడం ఖాయమని, ఆయన చేసిన అభివృద్ధి పనులే మళ్లీ గద్దెనెక్కిస్తాయని జోస్యం చెప్పారు. ఈ సభలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, కూటమి అభ్యర్థులు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేశ్‌బాబు, కేఎస్ఎన్ఎస్ రాజు, సుందరపు విజయ్‌కుమార్, పైలా ప్రసాదరావు, వంగలపూడి అనిత, తదితరులు పాల్గొన్నారు.

మోదీ మరొకసారి అధికారం చేట్టడం తథ్యం

-అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

సింహాచలం, మార్చి 29: కేంద్రంలో మరొకసారి నరేంద్రమోదీ నాయకత్వంలోని భాజపా ప్రభుత్వం ఏర్పడడం తథ్యమని అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేష్ ధీమా వ్యక్తంచేశారు. శుక్రవారం ఉదయం ఆయన సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. అక్కడ జరుగుతున్న సుదర్శన నారసింహ యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి కొండదిగువన తొలిపావంచా వద్దకు చేరుకున్నారు. అక్కడ అప్పన్నకు కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు చూపుతున్న అభిమానం చూస్తుంటే అనకాపల్లి స్థానం నుంచి తన విజయంతో పాటు కేంద్రంలో మోదీ సారథ్యంలో భాజపా ప్రభుత్వం మరోసారి పగ్గాలు చేపట్టడం ఖాయమన్న సంకేంతాలు కనిపిస్తున్నాయన్నారు. ఆయన వెంట నగర భాజపా అధ్యక్షులు మేడపాటి నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అధర్మచంద్రారెడ్డి

... 5వ పేజీ తరువాయి

లంచం డిమాండ్ చేశారు. దీనిపై ఫిర్యాదు అందడంతో ఏసీబీ అధికారులు దాడులు చేసి మండల ఆర్ఐ, సర్వేయర్‌ను పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో తహసీల్దారుగా ఉన్న ధర్మాచంద్రారెడ్డి ప్రమేయం కూడా ఉందన్న రైతు ఆరోపణల మేరకు ఏసీబీ అధికారులు కేసు నమోదుచేశారు. 2004లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ధర్మాచంద్రారెడ్డిపై కేసు ఎత్తివేసినట్టు రెవెన్యూ ఉద్యోగులు చెబుతారు. కాగా ధర్మాచంద్రారెడ్డి భీమిలి తహసీల్దారుగా పనిచేసే సమయంలో కాపులుప్పాడలో 27.44 ఎకరాల భూమిపై సకాలంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయలేదు. దాంతో ప్రభుత్వం నుంచి ఆ భూమి చేజారిపోయింది. అలాగే నగర నడిబొడ్డున సుమారు రెండు వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూములకు సంబంధించి ప్రభుత్వం తరపున సకాలంలో సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయకపోవడానికి ధర్మాచందారెడ్డి ప్రధాన కారకులనే ఆరోపణలు ఉన్నాయి. ఆయన విశాఖ అర్బన్ తహసీల్దారుగా పనిచేస్తున్న సమయంలో దసపల్లా భూములపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా హైకోర్టు తీర్పుచెప్పింది. దీనిపై సకాలంలో సుప్రీంకోర్టులో సవాల్ చేయకపోవడంతో వేల కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వం నుంచి చేజారిపోయాయి. ఈ వ్యవహారానికి బాధ్యుడిని చేస్తూ ధర్మాచంద్రారెడ్డిని అప్పుడు జిల్లా కలెక్టర్‌గా ఉన్న యువరాజ్ సస్పెండ్ చేశారు. ఆ తరువాత ఎందుచేతనో సస్పెన్షన్ ఎత్తివేశారు. ధర్మాచంద్రారెడ్డి నిర్లక్ష్యం వల్ల వేల కోట్ల రూపాయల విలువైన దసపల్లా భూములు ప్రభుత్వం కోల్పోవలసి వచ్చింది. దసపల్లా భూములు విషయంలో ప్రైవేటు వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ధర్మాచంద్రారెడ్డిని 2004లో తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కాపాడితే, ఇప్పుడు ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి సీఎం హోదాలో అభియోగాలను ఎత్తివేశారు.

భీమిలిపై వీడిన ఉత్కంఠ

... 5వ పేజీ తరువాయి

ఎన్నికల సమయంలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించగా ఆ పార్టీలో చేరి అనకాపల్లి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి సీనియర్ నాయకులైన దాడి వీరభద్రరావు (టీడీపీ), కొణతాల రామకృష్ణ(కాంగ్రెస్)లపై గెలిచారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున భీమిలి నుంచి పోటీ చేసి వైసీపీ అభ్యర్థి కర్రి సీతారామ్‌పై 37 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయ ఢంకా మోగించారు. గత 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి బరిలో దిగి వైసీపీ అభ్యర్థి కేకే రాజుపై పైచేయి సాధించి ఎమ్మెల్యే అయ్యారు. రెండు సార్లు మంత్రిగా పనిచేశారు. కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో మౌలిక వసతుల శాఖ మంత్రిగా, 2019లో చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో మానవ వనరుల శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఆయన ఏనాడు కూడా ఒకసారి పోటీ చేసిన నియోజకవర్గం నుంచి రెండోసారి పోటీ చేయలేదు. అయితే తన రికార్డును తానే బ్రేక్ చేసుకొని ఈసారి భీమిలి నుంచి పోటీ చేయబోతున్నారు.

ఐపీఎల్ సందడి

... 5వ పేజీ తరువాయి

నిశాంత్ సింధు, రచిన్ రవీంద్ర, శార్దూల్ ఠాకూర్, దుషార్ దేశ్‌పాండే, తదితరులు ఉన్నారు. విమానాశ్రయం నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లేందుకు సీఎస్‌కే ఆటగాళ్లు బస్సు ఎక్కుతున్న సమయంలో అభిమానులు కేరింతలు కొట్టారు. ధోనీ...ధోనీ అని నినాదాలు చేశారు. కాగా, ఇప్పటివరకు జరిగిన రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి మూడో మ్యాచ్‌లో పాల్గొనేందుకు విశాఖ చేరిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టుపై అభిమానులలో భారీ అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా మహీంద్రసింగ్ ధోనీ అభిమానులు మ్యాచ్‌పై ఆసక్తిగా ఉన్నారు.

తిరిగి నగరానికి చేరిన ఢిల్లీ క్యాపిటల్స్

గురువారం జైపూర్‌లో రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు తిరిగి శుక్రవారం హోమ్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విమానాశ్రయానికి చేరుకున్న ఆటగాళ్లు.. అక్కడ నుంచి ప్రత్యేక బస్సులో రాడిసన్ హోటల్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకున్నారు. ఇరుజట్ల ఆటగాళ్లు శనివారం సాయంత్రం నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.

చెక్‌పోస్టు వద్ద రూ.3లక్షల నగదు స్వాధీనం

కంచరపాలెం, మార్చి 29 : కంచరపాలెం మెట్టు వద్ద గల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో రూ.3లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ.భాస్కరరావు తెలిపారు. దేవరాపల్లికి చెందిన సత్యనారాయణ అనే వ్యక్తి బైక్‌పై జ్ఞానాపురం మీదుగా వస్తుండగా తనిఖీ చేయగా అతని వద్ద రూ.లక్ష, జగదాంబ ప్రాంతానికి చెందిన షణ్ముఖరావు కారులో రెండు లక్షలు నగదును పోలీసులు గుర్తించారు. వారి వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

భీమునిపట్నం, మార్చి 29 : వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి, ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష గడువును ఏప్రిల్ 5 వరకు పొడిగించినట్టు జిల్లా గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్, భీమిలి బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోడి రాంబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులు 5వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పక్షుల సంరక్షణకు చర్యలు

ఆరిలోవ, మార్చి 29 : వేసవి తాపం నుంచి పక్షులను సంరక్షించేందుకు జూపార్కు అధికారులు చర్యలు చేపట్టారు. పక్షులను వేడిమి నుంచి కాపాడానికి ప్రతిరోజూ మూడుసార్లు ఎన్‌క్లోజర్‌లపై నీటిని చిమ్ముతున్నారు. ఉదయం 9 నుంచి 11 గంటలకు ఒకసారి, సాయంత్రం రెండుసార్లు నీరు చిమ్ముతున్నారు.అలాగే పక్షులకు చల్లదనం ఇచ్చేందుకు గుజ్జుతో ఉన్న పండ్లు, గ్లూకోజ్ నీరు, బీ కాంప్లెక్స్ సిరప్‌లు అందిస్తున్నారు. వీటితో పాటు ఎన్‌క్లోజర్‌ల పైభాగంలో చలువ పందిళ్లు, తాటాకు పందిళ్లు, వెదురు తడికెలు వేస్తున్నారు.

నేటి నుంచి పైడితల్లి ఉత్సవాలు



భీమునిపట్నం (రూరల్), మార్చి 29 : మండలంలోని సింగనబందలో శనివారం నుంచి పైడితల్లమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జరిగే ముగింపు వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నారు.

డాక్టర్స్ కాలనీలో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

పెదవాల్తేరు : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ అన్నారు. శుక్రవారం ఆయన పెదవాల్తేరు డాక్టర్స్ కాలనీలో నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెలగపూడి రామకృష్ణబాబును, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి పోతన్న రెడ్డి, నెక్కంటి రాజు, చిన్నిపిల్లి నరేంద్ర, వాసు, కాకి శవ శంకర్ రెడ్డి, వరలక్ష్మి, జీవిత, గోపమ్మ, వెంకటేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా గోపాలరావు

భీమునిపట్నం, మార్చి 29 : భీమిలి అసెంబ్లీ స్థానానికి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర మాలమహానాడు వ్యవస్థాపకుడు భాగం గోపాలరావు పోటీ చేయనున్నారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో దళితులకు, బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని చట్ట సభల్లో ప్రశ్నించేందుకు ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు.

నీట్‌పై అవగాహన సదస్సు రేపు

తగరపువలస, మార్చి 29 : తగరపువలస దరి సంగివలసలో ఉన్న శశి పాఠశాలలో నీట్‌పై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు పాఠశాల చైర్మన్ బి. వేణుగోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 5 నుంచి 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐజీటీ ఫౌండేషన్, ఐఐటీ, నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ

తగరపువలస, మార్చి 29 : తగరపువలస జూట్‌మిల్లు రామాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోంది. సర్వే నంబరు 8-1లో 23 సెంట్ల గెడ్డ వాగు ఉంది. ఇక్కడ సామాజిక భవనం నిర్మించుకుంటామని స్థానికులు చాలాకాలంగా అధికారులను కోరుతున్నారు. కానీ ప్రభుత్వ స్థలం అని అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి కొంతమంది ఆ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకు రహదారి కూడా వేస్తున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శారద, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్, మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి)
- **ఆడుజీవితం :** శ్రీలీలామహల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఓం భీం బుష్ :** సంగం, కామేశ్వరి, రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **ప్రేమలు :** శ్రీకన్య, దుర్గ (మధురవాడ), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 16, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 22, క్యారేట్ 26, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబటి 30, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 140, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 48, ఆగాకర 52, పొటల్స్ 44, కీరదోస 24, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50,కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 10 లో..



స్వామివారికి విన్నపాలు కావిస్తున్న వైదిక బృందం



మహా యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

సింహగిరిపై కొనసాగుతున్న మహా యజ్ఞం

సింహాచలం, మార్చి 29 : సింహగిరిపై లోక కల్యాణార్థం చేపడుతున్న శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉభయ దేవేరులతో ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు తొళ్లక్కిలో, యజ్ఞ భగవానుడు సుదర్శన పెరుమాళ్‌ను వేరే పల్లకిలో ఉంచి సింహగిరి మాడవీధుల్లో ఊరేగించి, యాగశాలలో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. తొలుత ముక్కోటి దేవతా నిలయమైన కపిలగోవును యాగ శాల ప్రాంగణంలో తిప్పి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాల జ్వాలాతోరణ పూజలు, పరివార హోమాలు చేసి చతుర్వేదాలు, స్త్రీ, పురుష సూక్తాలతో, నృసింహ, సుదర్శనమూర్తి మంత్రాలతో అక్షరలక్ష జపం, హోమం చేశారు. యాగంలో సుమారు 275 మంది ఉభయ దాతలు (జంట)పాల్గొనగా వారితో ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇతర వైదిక సిబ్బంది పూజలు జరిపించారు. మధ్యాహ్నం హవనం తరువాత లఘు పూర్ణాహుతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, రాజ్యసభ సభ్యుడు, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ పాల్గొన్నారు. కాగా పూర్ణాహుతి తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి సన్నిధిలో విన్నపాలు విన్నవించారు.



సూర్యప్రభ వాహనంపై స్వామివారి తిరువీధి

సూర్యప్రభ వాహనంపై అప్పన్న

సింహగిరిపై జరుగుతున్న శ్రీసుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా వరాహలక్ష్మీనృసింహస్వామి శుక్రవారం సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు ఈఓ సింగల శ్రీనివాసమూర్తి స్వీయ పర్యవేక్షణలో వాహన సేవలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈమేరకు ఉత్సవమూర్తి గోవిందరాజాస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై అధిష్టింపజేశారు. కళాకారులు కోలాటం చేస్తుండగా, ఆస్థానం విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేద పఠనాల నడుమ స్వామివారి తిరువీధి వైభవంగా నిర్వహించారు. మార్గం పొడవునా భక్తులు కర్పూర నీరాజనాలిచ్చి స్వామివారిని ఆహ్వానించారు.

ఘనంగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

భీమునిపట్నం, మార్చి 29 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లోనూ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. భీమిలిలోని చిన్నబజారులో వున్న పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ఆధ్వర్యంలో సీనియరు నాయకులు చురకల రమణ, ఎంవీ గురుమూర్తి, బడిగంటి నీలకంఠం, చిలకా నర్సింగరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఎన్నికల్లో రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కాళ్ల నగేష్, గణేష్ రెడ్డి, జి. పోలిరాజు, కనకల అప్పలనాయుడు, గరే సదానంద, కారి అప్పారావు, చోడిపల్లి సాయి, పిట్టా వెంకటరావు, అప్పికొండ నూకరాజు, నరవ రామారావు, వి. పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ : ప్రజా సంక్షేమమే పరమావధిగా టీడీపీ పని చేస్తుందని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం అన్నారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఉన్న విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ కార్యాలయం వద్ద జరిగిన తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, నాయకులు బైరెడ్డి పోతనరెడ్డి, నూకరత్నం, ఆళ్ల శ్రీనివాస్, సత్తిబాబు పాల్గొన్నారు. అలాగే ఎంవీపీ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాళ్ల శంకర్, గొలగాని పోలరావు, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని సింహగిరి తొలిపావంచా వద్ద కార్పొరేటర్ పిసిని వరాహ నరసింహం ఆధ్వర్యంలో నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులంతా శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు గుసిడి అవినాష్‌బాబు, పట్నాల ధర్మరాజు, సిరిపురపు సురేష్, రాజనాల సత్యారావు పాల్గొన్నారు.



భీమిలిలో పార్టీ కార్యాలయం వద్ద వేడుకలు

ప్రజా బలం ఉన్న నాయకుడు జగన్

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సాగర్‌నగర్, మార్చి 29 : ప్రజా బలం ఉన్న నాయకుడు వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన గుడ్లవానిపాలెం, సాగర్‌నగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 8వ వార్డులో రూ. 70 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి జగన్ ప్రజల మనిషి అని, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. చంద్రబాబు హామీలు ఇచ్చి మరిచిపోతారన్నారు. ఆయనకు ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకువస్తారని, జగన్ గెలిచిన తరువాత ప్రజలతో మమేకమై ప్రజల మధ్యే ఉన్నారని తెలిపారు. తాను కూడా ప్రజల మధ్యే ఉంటూ సేవ చేస్తున్నానని, పక్క నియోజకవర్గాల నుంచి చుట్టం చూపుగా ఓ నాయకుడు వస్తున్నాడని, అతను గెలిచిన తరువాత ప్రజలకు ముఖం చూపే ఆనవాయితీ లేదన్నారు. ఆయన ఎందుకు ఈ నియోజకవర్గానికి వస్తున్నారో అర్థం కావడం లేదని చెప్పారు. సీఎం జగన్ అందించిన ప్రజా సంక్షేమ పథకాలే తమకు శ్రీరామ రక్ష అన్నారు.



గుడ్లవానిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంటాకు టికెట్ కేటాయింపుపై హర్షం

భీమునిపట్నం, మార్చి 29 : టీడీపీ అధినేత చంద్రబాబు భీమిలి అసెంబ్లీ టికెట్‌ను మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు ప్రకటించడంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు బీచ్‌రోడ్‌లో వున్న గంటా నివాసం వద్ద బాణసంచా కాల్చి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా గంటా నూకరాజు మాట్లాడుతూ గంటాను 50 వేల మెజార్టీతో గెలిపించి, చంద్రబాబుకు బహుమతిగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి, అనిల్‌ప్రసాద్, మారోజు సంజీవ్‌కు మార్, పెంటపల్లి యోగేశ్వరరావు, పుక్కళ్ల లక్ష్మీకుమారి, పైడిపల్లి ఎల్లయ్యమ్మ, పోలిరాజు, కొక్కిరి అప్పన్న, దౌలపల్లి హరీష్, జోగారావు, అప్పికొండ నూకరాజు, కంచర్ల కామేష్, కోండ్రు కృష్ణ పాల్గొన్నారు.

ఎండాడ/తగరపువలస : మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావుకు భీమిలి టికెట్ ప్రకటించడంతో టీడీపీ నా యకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు 8వ వార్డు అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గంటా శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయ్‌బాబు, చిన గోపి, బాబూరావు, కుమార్ పాల్గొన్నారు. అలాగే టీడీపీ భీమిలి నియోజకవర్గ వికలాంగుల విభాగం అధ్యక్షుడు చందవరపు కుమార్ ఎంవీపీ కాలనీలో గంటాను కలిసి అభినందనలు తెలిపారు. జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, తదితరులు కూడా గంటాను కలిసారు.

పద్మనాభం : గంటాకు టికెట్ ఖరారు కావడంతో పద్మనాభం జంక్షన్‌లో పార్టీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. నందీశ్వరరావు, తెలుగుయువత మండల అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, కె. శ్రీను, సురేష్, ఎస్. శ్రీనివాస్, అశోక్ పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, రుషికొండ ప్రాంతాల్లోనూ నాయకులు సంబరాలు జరిపారు.సాగర్‌నగర్‌లో అల్లూరి సీతారామరాజు కూడలిలో 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్కరబోయిన రాంబాబు, బి. దొరబాబు, సారిపల్లి శ్రీనివాసరావు, మంగాదేవి, జి. ఆనంద్, చెట్టుపల్లి సన్యాసిరావు, చిన్నగోపి పాల్గొన్నారు.

కొమ్మాది : టీడీపీ విశాఖ పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, ఆరో వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ ఎంవీపీ కాలనీలో గంటాను కలిసి అభినందనలు తెలిపారు. అలాగే జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రరావు కూడా గంటాను కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

అటవీ ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

సాగర్‌నగర్, మార్చి 29 : అటవీ శాఖ విశాఖ సర్కిల్ పర్యటనలో భాగంగా ఆ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) చిరంజీవి చౌదరి శుక్రవారం సాగర్‌నగర్‌తో పాటు పలు అటవీ ప్రాంతాలను పరిశీలించారు. ఎక్కడెక్కడ అటవీ శాఖ భూములున్నాయో చూశారు. కంబాలకొండ టీడీసీ, తూర్పు కనుమల జీవన వైవిధ్య కేంద్రం, అక్కడ జరుగుతున్న పనులు, ఔషధ వనాలు, నక్షత్రవనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ శ్రీకంఠనాథ్‌రెడ్డి, బీఎఫ్ఓ అనంత్ శంకర్, సబ్ డీఎఫ్ఓ ధర్మరక్షిత్, అటవీ శాఖ అధికారి రామ్‌నరేష్, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

పద్మనాభం, మార్చి 29 : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు తెలిపారు. విలాస్‌ఖాన్‌పాలెంలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఫరీదా (24) మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో ఈనెల 28న ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె బంధువు సిరజోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రూ. 3 లక్షల నగదు స్వాధీనం

పద్మనాభం, మార్చి 29 : చిన్నాపురం జంక్షన్ చెక్ పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో రూ. 3 లక్షల నగదు పట్టుబడింది. పోలీసులు ఇక్కడ శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టగా విలాస్‌ఖాన్‌పాలెంలో కోకోకోలా సరఫరా చేసి వస్తున్న బొలెరో వాహనంలో రూ. 3 లక్షల నగదు పట్టుబడింది. దీనికి తగిన రసీదులు చూపకపోవడంతో ఎస్ఎస్ టీమ్ సభ్యులు, పోలీసులు వాహనాన్ని, నగదును పద్మనాభం స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వాటిని తహసీల్దారుకు అప్పగించారు.

ఐదు మద్యం బాటిళ్లు పట్టివేత

పద్మనాభం, మార్చి 29 : మండలంలోని బొత్సపేటలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. గ్రామంలో బొత్స కృష్ణవేణి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా ఐదు బాటిళ్లు, ఒక ఫుల్ బాటిల్ దొరికాయి. ఈ మేరకు ఆమెపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై సురేష్ తెలిపారు. పట్టుబడిన సరకు విలువ సుమారు రూ. 2 వేల ఉంటుందన్నారు.

చర్చిల్లో గుడ్ ఫ్రై డే ప్రార్థనలు

భీమునిపట్నం, మార్చి 29 : తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రై డే పురస్కరించుకుని శుక్రవారం ప్రార్థనలు చేశారు. భీమిలిలోని నెహ్రూ రోడ్‌లో వున్న రోమన్ కేథోలిక్స్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో యేసు క్రీస్తు శిలువ మార్గ ప్రదర్శన నిర్వహించారు. చర్చి నుంచి ప్రారంభమైన ప్రదర్శన గంట స్తంభం, మెయిన్ రోడ్, పాత బస్టాండ్ మీదుగా సాగింది. యేసు శిలువ మార్గంలో పడిన కష్టాలను తెలుపుతూ క్రిస్టియన్లు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో భీమిలి, ఆనందపురం, పోలిపల్లి, తగరపువలస పరిసర ప్రాంతాలకు చెందిన క్రైస్తవులు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం/ఆరిలోవ : భానునగర్ సీయోను మందిరంలో పాస్టర్ వంక శివ శంకర్ లాజరస్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. అనంతరం కొండవాలు ప్రాంతంతో పాటు మద్దిలపాలెం, రామా టాకీస్, చర్చి చుట్టు పక్కల ప్రాంతాల్లో ఏసుక్రీస్తు గీతాలు ఆలపిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో కళా ఆస్పత్రి వైద్యుడు పీవీ రమణమూర్తి, కార్పొరేటర్ గొలగాని వీరరావు, పాస్టర్లు రాజకుమార్, గుత్తుల త్రిమూర్తి పాల్గొన్నారు. ఆరిలోవ, పెదగదిలి, రవీంద్రనగర్, బాలాజీనగర్, సాలిపేట, ఈశ్వరదేవీనగర్, తదితర చర్చిల్లోనూ వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా ఇమాన్యుల్ చర్చి పాదర్ ఇమాన్యుల్ ఏసు క్రీస్తు సందేశాన్ని వినిపిం చారు.

మధురవాడ : మధురవాడ పరిసర ప్రాంతాల్లోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మిథిలాపురి వుడాకాలనీలోని సెయింట్ ఫ్రాన్సిస్, స్వతంత్రనగర్ కాలనీ, మధురవాడ కూడలిలోని చర్చిల్లో మత పెద్దలు క్రీస్తు సందేశాన్ని వినిపించారు.



భానునగర్‌లో క్రీస్తు గొప్పతనాన్ని చెబుతున్న పాస్టర్



భీమిలిలో యేసు శిలువ మార్గ ప్రదర్శన

శ్రీభరత్‌కు అభినందనలు



శ్రీభరత్‌తో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ఎంవీపీ కాలనీ, మార్చి 29 : విశాఖ ప్రజల తరఫున పార్లమెంటులో బలమైన వాణి వినిపించాలంటే శ్రీభరత్ వంటి యువ నాయకులు అవసరమని ప్రముఖ ఆర్థిక నిపుణుడు, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ గొల్లు సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన ఎంవీపీ కాలనీలో శ్రీభరత్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఎంవీవీఎస్ మూర్తితో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మూర్తి వారసుడిగా శ్రీభరత్ కూడా రాజకీయాల్లో విలువలు పాటించాలని కోరారు.

22వ వార్డులో వెలగపూడి ప్రచారం



వృద్ధురాలికి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న వెలగపూడి

మద్దిలపాలెం, మార్చి 29 : రాష్ట్రాభివృద్ధి కోసం సైకిల్ గుర్తుకు ఓటేయాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. శుక్రవారం ఆయన 22వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీభరత్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు మరింత మేలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, ఒమ్మి అప్పారావు, దువ్వి స్వామి, పెసల శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక



జనసేనలో చేరిన 38వ వార్డు నాయకులు

మద్దిలపాలెం, మార్చి 29 : శివాజీపాలెంలో దక్షిణ నియోజకవర్గం కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో 38వ వార్డుకు చెందిన పలువురు శుక్రవారం జనసేన పార్టీలో చేరారు. వారికి వంశీకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు సమష్టిగా పని చేయాలన్నారు. దక్షిణలో జనసేన జెండా ఎగరడం ఖాయమన్నారు. పార్టీ విజయం కోసం పని చేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కనకరాజు, వాసు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిత కోసం కలిసికట్టుగా పనిచేద్దాం

- ఎస్. కోట టీడీపీ అభ్యర్థి కోళ్ల లలితకుమారి



కోళ్ల లలితకుమారిని అభినందిస్తున్న రవీంద్ర, తదితరులు

పెదవాల్తేరు మార్చి 29 : ఉత్తరాంధ్ర అభివృద్ధికి, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి కట్టుగా పనిచేయాలని ఎస్. కోట టీడీపీ అభ్యర్థిని కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం ఆమె నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రను కలిసారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ లలితకుమారి గెలుపునకు అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. త్వరలో నియోజకవర్గం, మండల స్థాయి సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేస్తాని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి, శ్రీరంగం దానేష్, దుర్వాసుల శర్వాణి, బొడ్డేటి రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీచర్లకు బకాయిలు చెల్లించాలి

- ఆపస్ రాష్ట్ర కార్యదర్శి రామునాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న రామునాయుడు

పద్మనాభం, మార్చి 29 : ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇప్పటివరకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర కార్యదర్శి ఈ రామునాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఆపస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు డీఏలు, పీఆర్‌సీ తదితర బకాయిలను ప్రభుత్వం ఈనెలాఖరులోగా చెల్లిస్తామని లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చినా ఇప్పటివరకు నెరవేర్చలేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ తీసుకురావాలన్నారు. అలాగే గతంలో సీపీఎస్ రద్దు కోసం చేసిన ఉద్యమంలో ఉపాధ్యాయులపై నమోదు చేసిన కేసులను కొట్టి వేయాలని డిమాండ్ చేశారు. ఆపస్ జిల్లా కార్యవర్గం అన్ని మండలాల్లో శాఖలు ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు, పూర్వ అధ్యక్షుడు నూకల సూర్యప్రకాష్, గౌరవాధ్యక్షుడు కె. గోపీనాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, ప్రధాన కార్యదర్శి త్రినాథ్ మూర్తి, కోశాధికారి విశ్వనాథ్, కార్యవర్గసభ్యులు కరుణ్‌కుమార్, అచ్చిబాబు, సురేష్, నారాయణ పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి శిక్షణ



శిక్షణ పొందిన మహిళలతో అధికారులు

భీమునిపట్నం (రూరల్), మార్చి 29 : మండలంలోని చిప్పాడ స్కిల్ డెవలప్‌మెంటు కేంద్రంలో శిక్షణ పొందిన అన్నవరం, నాగమయ్యపాలెం, చిప్పాడ, మూలకుద్దు గ్రామాలకు చెందిన మహిళలకు నిర్వాహకులు శుక్రవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జూట్ సంచుల తయారీ, టైలరింగ్ వంటి వాటిపై మహిళలకు మూడు నెలలు పాటు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీవీఎస్ మేనేజరు ఎంఎస్ రావు మాట్లాడుతూ ఇటు వంటి శిక్షణల వల్ల మహిళలు తమంత తాము స్వయం ఉపాధి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు.